www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -215 ఆదివారం 22 నవంబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాకు
మార్గదర్శకాలు జారీ

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా రక్షణ.. ఒక్కరికి మాత్రమే అవకాశం

ఒకరి కంటే ఎక్కువ మంది నామినీలను ఎంపిక చేసుకునేందుకు వెసులుబాటు

హైదరాబాద్, నవంబర్ 21 (ప్రజావినికిడి):

: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం (ఐకేజేబీపీ) కింద లబ్ధిదారుల నమోదు ప్రక్రియకు రాష్ట్ర ప్రణాళికా శాఖ మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ పథకం ద్వారా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పించనున్నారు. కుటుంబంలో ఒకరికి మాత్రమే బీమా పొందే అవకాశం ఉంటుంది. బీమా పొందిన వ్యక్తి మరణిస్తే, వారు ఎంపిక చేసుకున్న నామినీలకు రూ.5 లక్షల పరిహారం అందజేస్తారు. ఈ పథకంలో కుటుంబంలోని సంపాదించే వ్యక్తికి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. నమోదు చేసుకునే సమయానికి లబ్ధిదారుడి వయస్సు 18 నుంచి 59 సంవత్సరాల మధ్య ఉండాలి. 1967 నవంబర్ 19 నుంచి 2008 నవంబర్ 18 మధ్య**మిగతా 2లో...**



ఆలోచన పరిధి విస్తరించాలి

ఆలోచనల హద్దులు చెరిపితేనే దేశ సామర్థ్యం వెలుగులోకి వస్తుంది

యువతలో అపారమైన శక్తి ఉంది..

అసాధ్యాలను సుసాధ్యం చేయగలరు: ప్రధాని నరేంద్ర మోదీ

ఐఐటీ ఖరగ్‌పూర్ వజ్రోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రధాని..

75 ఏళ్ల ప్రస్థానానికి గుర్తుగా ప్రత్యేక నాణెం ఆవిష్కరణ

2లో.



యలహంకలోకి షర్మిలకు 'నో ఎంట్రీ'

కోర్టుకెక్కి ఉత్తర్వులు తెచ్చుకున్న జగన్



అమరావతినవంబర్ 21(ప్రజావినికిడి):

మరో నాలుగు రోజుల్లో తన మేనకోడలి వివాహం! పెళ్లి పనుల కోసం ఆదివారం నుంచి ఆ ఇంట్లో బస చేసేందుకు చెల్లి ఏర్పాట్లు! ఇంతలో తన చెల్లి ఆ ఇంట్లోకి అడుగుపెట్టడానికి వీల్లేదంటూ కోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చుకున్నారు. తాజా పరిణామంతో... అన్నా చెల్లెళ్ల మధ్య వివాదం పతాక స్థాయికి చేరినట్లయింది. బెంగళూరులోని యలహంకలో ఉన్న **మిగతా 2లో...**

ఆసియాలోనే అతి పెద్ద రిలయన్స్ ఫ్యాక్టరీ..

కర్నూలు వేదికగా కాంపా కోలా ప్రారంభం

కర్నూలు జిల్లా ఓర్వకల్లులో రిలయన్స్ అతిపెద్ద ప్లాంట్

కేవలం ఏడాది వ్యవధిలోనే పూర్తయిన ప్రాజెక్ట్


కాంపా కోలా జ్యూస్‌ల తయారీ ప్రారంభం

స్థానిక యువతకు 1200 ప్రత్యక్ష ఉద్యోగాలు

వలసలు తగ్గిస్తూ సొంత జిల్లాలోనే ఉపాధి

ఏపీపై నమ్మకంతో ఇంతటి భారీ పరిశ్రమ ఏర్పాటు

చేసిన రిలయన్స్ యాజమాన్యానికి ధన్యవాదాలు: లోకేశ్





అమరావతి నవంబర్ 21 (ప్రజావినికిడి):

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతిలో మరో కీలక మైలురాయి నమోదైంది. ప్రముఖ దిగ్గజ సంస్థ రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్, కర్నూలు జిల్లా ఓర్వకల్లులో ఏర్పాటు చేసిన ఆసియాలోనే అతిపెద్ద బెవరేజ్ ప్లాంట్‌ను విజయవంతంగా ప్రారంభించింది. శంకుస్థాపన జరిగిన కేవలం 12 నెలల వ్యవధిలోలోనే ఇంతటి భారీ అత్యాధునిక **మిగతా 2లో...**

హైదరాబాద్ 'మెటా' కార్యాలయంలో కాంగ్రెస్ కార్యకర్తల విధ్వంసం..

మండిపడ్డ బీజేపీ, బీఆర్ఎస్

తమ నేతల సోషల్ మీడియా ఖాతాలపై ఆంక్షలు విధించారంటూ నిరసన

కార్యాలయ కారిడార్లలోని పూలకుండీలను ధ్వంసం



2లో.

పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు..

రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యలపై మహేశ్ గౌడ్ స్పందన

పార్టీలో ప్రజాస్వామ్యం కొంచెం ఎక్కువైందంటూ మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్య

ఎమ్మెల్యేల వ్యాఖ్యలను ఏఐసీసీ నిశితంగా పరిశీలిస్తోందని వెల్లడి

పార్టీ లైన్ దాటితే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరిక



2లో.

కల్వర్టును ఢీకొట్టి కాలువలో కారు..

అక్కడికక్కడే నలుగురి మృతి

ప్రకాశం జిల్లా ఒంగోలు వద్ద ఘటన

అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టిన మారుతి ఎర్టిగా కారు

డ్రైవర్ నిద్రమత్తు వల్లే ప్రమాదం జరిగిందని ప్రాథమిక నిర్ధారణ

తిరుపతి నుంచి బాపట్లకు వెళ్తుండగా పెళ్లూరు వద్ద ఘటన



ఒంగోలుననవంబర్ 21 (ప్రజావినికిడి):

ప్రకాశం జిల్లాలో ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఒంగోలు సమీపంలోని పెళ్లూరు వద్ద అతివేగంతో వెళ్తున్న కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొన్న ఘటనలో నలుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో ఇద్దరు స్వల్ప గాయాలతో ఈ ప్రమాదం నుండి**మిగతా 2లో...**

కాంగ్రెస్ పాలనలో గ్రామాల అభివృద్ధి ఆగిపోయింది

ఆర్బీఐ నివేదికను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు

తెలంగాణలో గ్రామ పంచాయతీల ఖర్చులు భారీగా తగ్గాయని విమర్శ

హైదరాబాద్,నవంబర్ 2(ప్రజావినికిడి):

కేసీఆర్ హయాంలో అభివృద్ధి బాటలో సాగిన తెలంగాణ గ్రామాలు, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో నిధుల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో గ్రామ పంచాయతీల ఖర్చులు భారీగా తగ్గిపోయాయని పేర్కొంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఆయన**మిగతా 2లో...**



తెలంగాణలో కాంగ్రెస్ పని అయిపోయింది

బీఆర్ఎస్‌ను ప్రజలే బొందపెట్టారు.. రాష్ట్రంలో వచ్చేది డబుల్ ఇంజిన్ ప్రభుత్వమే

కరీంనగర్‌లో లక్ష మందితో మహా పాదయాత్ర నిర్వహిస్తాం: కేంద్ర మంత్రి బండి సంజయ్

హైదరాబాద్, నవంబర్ 21 (ప్రజావినికిడి):

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరిగిందని, ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఆ పార్టీ సింగిల్ డిజిట్‌కే పరిమితమవుతుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం**మిగతా 2లో...**



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

ఆసియాలోనే అతి పెద్ద రిలయన్స్ ఫ్యాక్టరీ..

మొదటిపేజీ తరువాయి

తయారీ నాకేంద్రాన్ని పూర్తి చేసి కార్యకలాపాలు ప్రారంభించడం విశేషం. ఈ సాయంత్రం ఐదు గంటలకు ఓ భారీ ప్రకటన ఉంటుందన్న మంత్రి నారా లోకేశ్.. చెప్పినట్టుగానే ఈ మేరకు ప్రకటన చేశారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో గత ఏడాది నవంబర్‌లో ఈ ప్రాజెక్టుకు భూమిపూజ జరిగింది. పనులను శరవేగంగా పూర్తి చేసుకున్న ఈ ప్రపంచ స్థాయి ప్లాంట్‌లో ఇప్పటికే కాంపా కోలా, పండ్ల రసాలు (జ్యూస్‌లు), ప్యాకేజ్డ్ తాగునీటి ఉత్పత్తి మొదలైంది. ప్రభుత్వం అమలు చేస్తున్న 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానానికి ఈ ప్లాంట్ అత్యుత్తమ నిదర్శనంగా నిలిచింది. తరతరాల భారతీయులకు సుపరిచితమైన స్వదేశీ బ్రాండ్ కాంపా కోలా, ఇప్పుడు రాయలసీమ గడ్డ నుంచి సరికొత్త రూపుతో పునర్జన్మ పొందింది. ఓర్వకల్లులో తయారయ్యే ఈ ఉత్పత్తులు దేశవ్యాప్తంగా ఉన్న వినియోగదారులకే కాకుండా, అంతర్జాతీయ మార్కెట్లకు కూడా సరఫరా కానున్నాయి. ప్రపంచస్థాయి దిగ్గజ సంస్థలతో పోటీ పడేందుకు స్వదేశీ బ్రాండ్‌కు ఆంధ్రప్రదేశ్ కేంద్ర బిందువుగా మారడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది.

ఈ ప్రాజెక్ట్ ద్వారా స్థానిక యువతకు విస్తృత అవకాశాలు దక్కాయి. గతంలో ఉద్యోగాల కోసం సుదూర



ప్రాంతాలకు, ఇతర మెట్రో నగరాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితులు ఉండేవి. అయితే ఇప్పుడు నంద్యాలకు చెందిన మహేష్ హరి, కర్నూలుకు చెందిన ఆర్.కె. స్ఫూర్తి వంటి ఎంతో మంది స్థానిక యువతీయువకులు తమ సొంత ప్రాంతంలోనే, అంతర్జాతీయ ప్రమాణాలున్న ప్లాంట్‌లో పనిచేస్తున్నారు. రాయలసీమ యువతకు స్థానికంగానే ఉపాధి కల్పిస్తామన్న హామీ నెరవేరింది.

ఈ భారీ ప్లాంట్ ద్వారా స్థానిక ప్రజలకు 1,200 ప్రత్యక్ష ఉద్యోగాలు లభించాయి. దీంతో పాటు రవాణా (లాజిస్టిక్స్), వ్యవసాయ అనుబంధ రంగాలు, ఇతర చిన్నతరహా పరిశ్రమల ద్వారా పరోక్షంగా వేలాది మందికి లబ్ధి చేకూరనుంది. రాష్ట్రంపై నమ్మకంతో పెట్టుబడులు పెట్టినందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు ధన్యవాదాలు తెలుపుతూ, రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోనూ ఇలాంటి పారిశ్రామిక విజయాలను విస్తరింపజేయడమే లక్ష్యంగా ప్రణాళికలు ముందుకు సాగుతున్నాయి. ఈ మేరకు నారా లోకేశ్ సోషల్ మీడియాలో వివరాలు పంచుకున్నారు.

ముఖ్యంగా ఈ ప్లాంట్ ద్వారా స్థానిక యువతకు సొంత గడ్డపైనే ఉపాధి లభించడం అత్యంత సంతృప్తిని ఇస్తోందని లోకేశ్ పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం యువత కుటుంబాలను, ఊళ్లను వదిలి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా.. ఉద్యోగాలే యువతను వెతుక్కుంటూ రావాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, రాయలసీమ ప్రజలకు ఇచ్చిన ఆ మాటను నిలబెట్టుకుంటున్నామని తెలిపారు.ఈ భారీ ప్రాజెక్టు ద్వారా స్థానిక యువతకు 1,200 ప్రత్యక్ష ఉద్యోగాలు అందుబాటులోకి వస్తున్నాయని, అదే సమయంలో రవాణా, వ్యవసాయం, ఇతర అనుబంధ రంగాల్లో పెద్దఎత్తున పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. నంద్యాలకు చెందిన మహేశ్ హరి, కర్నూలుకు చెందిన ఆర్.కె. స్ఫూర్తి వంటి స్థానిక యువతీ యువకులు సొంత ప్రాంతంలోనే ఇలాంటి ప్రపంచ స్థాయి సంస్థలో పనిచేస్తుండటం శుభపరిణామమని లోకేశ్ ప్రస్తావించారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లా నుంచి భవిష్యత్తులో ఇలాంటి విజయగాథలు మరిన్ని రావాలని, అందరం కలిసి ఆ దిశగా అడుగులు వేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాకు మార్గదర్శకాలు జారీ

మొదటిపేజీ తరువాయి

జన్మించిన వారు అర్హులుగా నిర్ణయించారు. వయస్సు నిర్ధారణకు ఆధార్ కార్డులోని పుట్టిన తేదీని ప్రామాణికంగా తీసుకుంటారు. ఆధార్‌లో పుట్టిన సంవత్సరం మాత్రమే నమోదై ఉంటే సంబంధిత సంవత్సరం జూలై 1వ తేదీని జన్మదినంగా పరిగణిస్తారు. పుట్టిన తేదీలో తప్పులు ఉంటే ముందుగా ఆధార్ కేంద్రంలో సరిచేసుకోవాలి.

రేషన్ కార్డుతోనే నమోదు

లబ్ధిదారుల నమోదు కోసం గ్రామ పంచాయతీలు, పట్టణ వార్డుల పరిధిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నారు. తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన రేషన్ కార్డు నంబరునే దరఖాస్తు ఫారం నంబరుగా పరిగణిస్తారు. నమోదు సమయంలో ఆధార్ కార్డు, రేషన్ కార్డు, మొబైల్ నంబర్ వివరాలను అందించాల్సి ఉంటుంది. రేషన్ కార్డు ఈ-కేవైసీ పెండింగ్‌లో ఉన్నవారు ముందుగా దానిని పూర్తి చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఒకరి కంటే ఎక్కువ మంది నామినీలకు అవకాశం

బీమా పొందే వ్యక్తి తనకు నచ్చిన ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మంది నామినీలను ఎంపిక చేసుకోవచ్చు. ఒకరి కంటే ఎక్కువ మంది నామినీలను ఎంపిక చేస్తే రూ.5 లక్షల పరిహారాన్ని వారికి ఏ నిష్పత్తిలో పంపిణీ చేయాలనే విషయాన్ని నమోదు సమయంలోనే స్పష్టంగా పేర్కొనాలి. నామినీలలో ఎవరైనా మైనర్లు ఉంటే వారి తరఫున బీమా పరిహారాన్ని స్వీకరించేందుకు 18 ఏళ్లు నిండిన వ్యక్తిని అపాయింటీగా నమోదు చేయాలి. ఈ వ్యక్తి కుటుంబ సభ్యుడే అయి ఉండాలన్న నిబంధన లేదు.

నమోదు పూర్తయితే రసీదు

విజయవంతంగా నమోదు పూర్తయిన ప్రతి లబ్ధిదారుడికి ట్రాన్సాక్షన్ ఐడీతో కూడిన రసీదు సందేశాన్ని పంపిస్తారు. బీమా రక్షణ ప్రారంభమైన తేదీ నుంచి సంబంధిత పాలసీ సంవత్సరం ముగిసే వరకు పూర్తి బీమా కవరేజీ ఉంటుంది. ఆ సమయంలో లబ్ధిదారుడికి గరిష్ఠ వయోపరిమితి దాటినా ఆ పాలసీ సంవత్సరం ముగిసే వరకు బీమా రక్షణ కొనసాగుతుంది.

ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక హెల్ప్‌డెస్క్

నమోదు సమయంలో వివరాల్లో తేడాలు, సాంకేతిక సమస్యలు, ఇతర సందేహాలు తలెత్తితే పరిష్కరించేందుకు ప్రతి శిబిరంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయనున్నారు. జిల్లా స్థాయిలో సమస్యలను సమీక్షించి అవసరమైన చర్యలు తీసుకునేలా అధికారులకు బాధ్యతలు అప్పగించారు. అర్హులైన కుటుంబాలందరికీ పథకం ప్రయోజనాలు అందేలా పారదర్శకంగా నమోదు ప్రక్రియ నిర్వహించాలని ప్రభుత్వం మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది.

ఆలోచన పరిధి విస్తరించాలి

ఐఐటీ ఖరగ్‌పూర్ వజ్రోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రధాని..

ఖరగ్‌పూర్,నవంబర్ 21 (ప్రజావినికిడి):

దేశం తన అసలైన సామర్థ్యాన్ని గుర్తించాలంటే ఆలోచనల్లో ఉన్న పరిమితులను అధిగమించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని ఐఐటీ ఖరగ్‌పూర్ 75వ వార్షికోత్సవం (ప్లాటినం జూబ్లీ) వేడుకల్లో శనివారం ఆయన పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. యువతలో అపారమైన ప్రతిభ, సృజనాత్మకత ఉన్నాయని, వారు అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు ఎలాంటి హద్దులు పెట్టుకోవద్దని సూచించారు. గత 12 ఏళ్లలో భారత్ ఆలోచనా విధానంలో మార్పు తీసుకొచ్చి అనేక రంగాల్లో కొత్త అవకాశాలను సృష్టించిందన్నారు. **»Break the Limits, Unlock the Possibilities»** అనే నినాదంతో



దేశం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

ఐఐటీ ఖరగ్‌పూర్ దేశంలోనే తొలి ఐఐటీ అని, 1951లో ప్రారంభమైన ఈ విద్యాసంస్థ ఏడు దశాబ్దాలకు పైగా సాంకేతిక విద్య, పరిశోధన, ఆవిష్కరణల్లో విశేష సేవలు అందించిందని కొనియాడారు. అంతరిక్ష పరిశోధనలు, అణుశక్తి, సాఫ్ట్‌వేర్ రంగాలతో పాటు ప్రపంచస్థాయి సంస్థల అభివృద్ధిలో ఈ సంస్థ పూర్వ విద్యార్థులు కీలక పాత్ర పోషించారని తెలిపారు. సెమీకండక్టర్, అంతరిక్ష పరిశోధన రంగాల్లో భారత్ సాధిస్తున్న పురోగతిని ప్రస్తావించిన మోదీ.. యువతకు కొత్త ఆవిష్కరణలు, స్టార్టప్‌ల ద్వారా అపారమైన అవకాశాలు ఉన్నాయని చెప్పారు. చిప్ తయారీ నుంచి అంతరిక్ష రంగం వరకు భారత యువత తమ ప్రతిభను చాటుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఐఐటీ ఖరగ్‌పూర్ 75 ఏళ్ల ప్రస్థానానికి గుర్తుగా ప్రత్యేక స్మారక నాణేన్ని ప్రధాని ఆవిష్కరించారు. '75 ఎశీఅఎవం టశీతీ ఎఱఎంఱ్ దీష్ట్రుతీఖ్' కార్యక్రమంలో భాగంగా 75 మంది విద్యార్థులతో ముచ్చటించారు. సంస్థ అభివృద్ధి చేసిన తక్కువ ఖర్చుతో కూడిన వైద్య సాంకేతిక ఆవిష్కరణలు, ఆరోగ్య సేవలను కూడా పరిశీలించారు.వికసిత భారత్ లక్ష్య సాధనలో ఐఐటీ ఖరగ్‌పూర్ వంటి విద్యాసంస్థలు కీలక పాత్ర పోషించాలని మోదీ ఆకాంక్షించారు.

హైదరాబాద్ 'మెటా' కార్యాలయంలో కాంగ్రెస్ కార్యకర్తల విధ్వంసం..

మండిపడ్డ బీజేపీ, బీఆర్ఎస్

హైదరాబాద్ నవంబర్ 21 (ప్రజావినికిడి):

తమ జాతీయ నాయకుల సోషల్ మీడియా ఖాతాలపై ఆంక్షలు విధించడాన్ని నిరసిస్తూ తెలంగాణ యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు నిన్న హైదరాబాద్ రాయదుర్గంలోని మెటా కార్యాలయం ప్రాంగణంలో ఆందోళన చేపట్టారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి నేతృత్వంలో దాదాపు 25 మంది కార్యకర్తలు సైబ్యూ భవనంలోకి ప్రవేశించి కేంద్ర ప్రభుత్వం, మెటా సంస్థకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో కారిడార్‌లోని పూలకుండీలను కొందరు కార్యకర్తలు ధ్వంసం చేశారు.భారత యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్, జాతీయ ఇన్‌ఛార్జ్ మనీష్ శర్మల ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలను నిలిపివేయడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని యూత్ కాంగ్రెస్ ఆరోపించింది. ఖాతాలపై ఆంక్షలను వెంటనే



ఎత్తివేయాలని, లేకుంటే ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని ఏడు రోజుల అల్టిమేటం జారీ చేసింది. ఇదే అంశంపై ముంబైలోని మెటా కార్యాలయం వెలుపల కూడా ఆ పార్టీ శ్రేణులు నిరసన చేపట్టాయి.ఈ ఘటనపై సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు సుమారు 21 మంది నిరసనకారులను ముందస్తు జాగ్రత్తగా అదుపులోకి తీసుకుని, అనంతరం బెయిల్‌పై విడుదల చేశారు. నిరసనకారులు ప్రధాన కార్యాలయంలోకి ప్రవేశించలేదని, సంస్థ నుంచి ఎటువంటి అధికారిక ఫిర్యాదు రాకపోవడంతో కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.యూత్ కాంగ్రెస్ తీరుపై బీజేపీ, బీఆర్ఎస్ నేతలు తీవ్ర స్థాయిలో స్పందించారు. కాంగ్రెస్ కార్యకర్తలు ప్రైవేట్ సంస్థల కార్యాలయాలపై దాడులు చేస్తూ గూండాయిజానికి పాల్పడుతున్నారని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ విమర్శించారు. మరోవైపు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందిస్తూ... ఎన్నో ఏళ్లుగా కష్టపడి నిర్మించిన 'బ్రాండ్ హైదరాబాద్' నమ్మకాన్ని ఇలాంటి చర్యలు దెబ్బతీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. విదేశీ సంస్థలు రాజకీయాలకు దూరంగా వ్యాపారం చేసుకోవాలని, ప్రభుత్వం కూడా వాటిపై అనవసర ఒత్తిడి తీసుకురాకూడదని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు. కాగా, ఈ ఆరోపణలు, పరిణామాలపై మెటా సంస్థ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

యలహంకలోకి షర్మిలకు 'నో ఎంట్రీ'

మొదటిపేజీ తరువాయి

సువిశాల ప్రాంగణంలో తండ్రి వైఎస్ రాజశేఖర రెడ్డి తనకు, తన సోదరుడికి వేర్వేరు భవనాలు నిర్మించి ఇచ్చారని షర్మిల చెబుతున్నారు.యలహంక ఆస్తిలో షర్మిలకూ వాటా ఉందని తల్లి విజయలక్ష్మి గతంలో స్పష్టం చేశారు. అప్పట్లో ఈ ఆస్తిని వైఎస్ కొన్ని ప్రత్యేక కారణాలవల్ల జగన్ అత్త(భారతీ రెడ్డి తల్లి) సుగుణమ్మ పేరిట పెట్టినట్లు తెలుస్తోంది. బెంగళూరుకు వెళ్లినప్పుడు యలహంక గెస్ట్‌హౌస్‌లో షర్మిల బస చేసేవారు. ఈ క్రమంలో తన కుమార్తె అంజలి రెడ్డి వివాహాన్ని యలహంక నివాసంలో జరిపించాలనుకోవడం... 'ఆ ఆస్తితో నీకు సంబంధంలేదు.కానీ... అనూహ్యంగా జగన్ కోర్టును ఆశ్రయించి, 'నో ఎంట్రీ' ఆదేశాలు పొందారు. షర్మిల యలహంక నివాసంలోకి అడుగుపెట్టకుండా అడ్డుకోవాలంటూ 18న జగన్ తొలిసారి ప్రయత్నం చేశారు. బెంగళూరులోని దేవనహళ్లి సివిల్ జడ్జి కోర్టులో షర్మిలను ప్రతివాదిగా చేరుస్తూ... సిలికాన్ బిల్డర్స్ ప్రైవేటు లిమిటెడ్ తరఫున భీమిశెట్టి రమేశ్ బాబు ఈ కేసు దాఖలు చేశారు. అయితే... అనూహ్యంగా ఆ కేసును వెనక్కి తీసుకొన్నారు. ఆ తర్వాత శుక్రవారం దేవనహళ్లిలోనే ఉన్న సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో భీమిశెట్టి రమేశ్ బాబు మరో పిటిషన్ వేశారు.ఇప్పుడు అలంకరణ పేరిట తన మనుషులను పంపి ఆస్తిని తన ఆధీనంలోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అదే జరిగితే... అక్కడ ఉన్న వ్యవసాయం దెబ్బతింటుంది. మొక్కలు పాడైపోతాయి. అందువల్ల షర్మిలను, ఆమె తరఫు వారెవరినీ ఇంట్లోకి రాకుండా అత్యవసరంగా ఎక్స్‌పార్టీ ఉత్తర్వులు ఇవ్వండి" అని భీమిశెట్టి కోర్టును అభ్యర్థించారు. న్యాయస్థానం దీనికి అనుకూలంగా పర్మనెంట్ ఇంజక్షన్ ఆర్డర్స్ జారీ చేసింది.

కల్వర్టును ఢీకొట్టి కాలువలో కారు..

మొదటిపేజీ తరువాయి

ప్రాణాపాయం లేకుండా బయటపడ్డారు.వివరాల్లోకి వెళితే.. తిరుపతి నుంచి ఆరుగురు వ్యక్తులు మారుతి సుజుకి ఎర్టిగా కారులో బాపట్లకు బయలుదేరారు. శనివారం ఉదయం 6:10 గంటల సమయంలో ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని పెళ్లూరు వద్దకు చేరుకోగానే, డ్రైవర్ ప్రవీణ్ నిద్రమత్తులోకి జారుకోవడంతో వాహనం అదుపు తప్పింది. జాతీయ రహదారి పక్కనే ఉన్న కల్వర్టు గోడను కారు బలంగా ఢీకొట్టి, సమీపంలోని కాలువలో బోల్తా పడింది.ఈ ఘోర ప్రమాదంలో డ్రైవర్ ప్రవీణ్‌తో పాటు కారులో ప్రయాణిస్తున్న వెంకట్రావు, సుజాత, సీతామహాలక్ష్మి సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. కారులో ఉన్న నూతన దంపతులు శ్రీతేజ, కైవల్య స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ప్రమాద స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు..

రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యలపై మహేశ్ గౌడ్ స్పందన

పార్టీలో ప్రజాస్వామ్యం కొంచెం ఎక్కువైందంటూ మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్య

ఎమ్మెల్యేల వ్యాఖ్యలను ఏఐసీసీ నిశితంగా పరిశీలిస్తోందని వెల్లడి

హైదరాబాద్ నవంబర్ 21(ప్రజావినికిడి):

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి ఇటీవల సొంత పార్టీపై చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. పార్టీ లైన్ దాటి మాట్లాడే నేతలపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే అంశాన్ని అధిష్ఠానం చూసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, పార్టీ అంతర్గత వ్యవహారాలపై ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు.

"కాంగ్రెస్‌లో ప్రజాస్వామ్యం కొంచెం ఎక్కువైంది. పార్టీ లైన్ దాటి మాట్లాడే వారిపై క్రమశిక్షణ చర్యల గురించి ఏఐసీసీ చూసుకుంటుంది. ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యలను ఏఐసీసీ నిశితంగా పరిశీలిస్తోంది" అని తెలిపారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బీజేపీ బలంగా ఉందంటూ చేసిన వ్యాఖ్యలు, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రభుత్వ స్థిరత్వం, పనితీరుపై మాట్లాడిన అంశాలు పార్టీలో తీవ్ర చర్చకు దారితీసిన నేపథ్యంలో పీసీసీ చీఫ్ ఈ వివరణ ఇచ్చారు.

ఈ సందర్భంగా క్రమశిక్షణ ప్రాధాన్యతను వివరిస్తూ ఆయన గత ఉదంతాన్ని గుర్తుచేశారు. "గతంలో కొండా సురేఖ విషయంలోనూ మొదటిసారే చర్యలు తీసుకోలేదు. పలుమార్లు హెచ్చరించాం. తీరు మారకపోవడంతోనే చర్యలు తీసుకోవాల్సి వచ్చింది. క్రమశిక్షణ ముందు అందరూ సమానమే. దేనికైనా సరైన సమయం ఉంటుంది" అని స్పష్టం చేశారు. పార్టీలో ప్రతి ఒక్కరూ నిబంధనలకు కట్టుబడి ఉండాలని, ఎవరైనా పరిధి దాటి ప్రవర్తిస్తే అధిష్ఠానం తగిన సమయంలో నిర్ణయం తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్ పాలనలో గ్రామాల అభివృద్ధి ఆగిపోయింది

మొదటిపేజీ తరువాయి

తీవ్ర ఆరోపణలు చేశారు.రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) విడుదల చేసిన 'ఫైనాన్సెస్ ఆఫ్ పంచాయతీరాజ్ ఇన్‌స్టిట్యూషన్స్' నివేదికను ప్రస్తావిస్తూ కేటీఆర్ ఈ వివరాలను వెల్లడించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణలోని గ్రామ పంచాయతీలు సగటున ఒక్కొక్కటి రూ.16.59 లక్షలు ఖర్చు చేయగా, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో 2024-25 నాటికి ఆ మొత్తం రూ.6.24 లక్షలకు పడిపోయిందని ఆయన తెలిపారు.

ప్రజలు కట్టిన పన్నులు, ప్రభుత్వం తెస్తున్న అప్పులు అభివృద్ధి పనులకు చేరడం లేదని ఆరోపించారు. రేవంత్ రెడ్డి పాలనలో పల్లె నుంచి పట్నం వరకు ఎక్కడా అభివృద్ధి కనిపించడం లేదని, జరుగుతున్నదంతా విధ్వంసమేనని కేటీఆర్ పేర్కొన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ పని అయిపోయింది

మొదటిపేజీ తరువాయి

అధికారాన్ని కోల్పోవడం ఖాయమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం కొడంగల్‌ను వదిలి మహేశ్వరం నియోజకవర్గానికి వెళ్లాల్సిన పరిస్థితి వస్తుందని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌ను ఇప్పటికే ప్రజలు తిరస్కరించారని, రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ ఆధ్వర్యంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పడుతుందని ధీమా వ్యక్తం చేశారు.

శనివారం హైదరాబాద్‌లో ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు రాజకీయ అంశాలపై మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య అవినీతి, అక్రమాలు, కుటుంబ పాలనలోనే పోటీ ఉందని విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీ బలంగా ఎదుగుతోందని, ప్రజలు మార్పును కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జీహెచ్ఎంసీ ఎన్నికలకు వెళ్లేందుకు, ఉప ఎన్నికలు నిర్వహించేందుకు వెనుకాడుతున్నారని ఆరోపించారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్, ఇండీ కూటమి చేస్తున్న ఆరోపణలను బండి సంజయ్ ఖండించారు. దేశవ్యాప్తంగా 14 కోట్ల ఓట్లను ఎన్నికల సంఘం తొలగించిందన్న రాహుల్‌గాంధీ వ్యాఖ్యల్లో వాస్తవం లేదన్నారు. ఓటర్ల జాబితా సవరణ ఇంకా ముసాయిదా దశలోనే ఉందని తెలిపారు. మరణించినవారు, శాశ్వతంగా వలస వెళ్లినవారు, ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాల్లో ఓటర్లుగా నమోదైనవారిని గుర్తించి జాబితాను ప్రక్షాళన చేయడమే ఈ ప్రక్రియ ఉద్దేశమని వివరించారు.అర్హులైన ఓటర్లకు ఎలాంటి అన్యాయం జరగదని, పొరపాటున పేర్లు తొలగించబడితే తిరిగి నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. 14 కోట్ల మంది అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించారన్న ఆరోపణలకు ఆధారాలు చూపించాలని రాహుల్‌గాంధీకి సవాల్ విసిరారు. ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధ సంస్థలపై రాజకీయ ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు.డీలిమిటేషన్, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల బిల్లుల విషయంలో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని బండి సంజయ్ స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటారని పేర్కొన్నారు. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో ఈ బిల్లులకు ఆమోదం లభిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ నెల 23న బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కరీంనగర్‌లో పర్యటించనున్నట్లు బండి సంజయ్ వెల్లడించారు. 'ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం.. అరాచకత్వాన్ని పాతరేద్దాం' అనే నినాదంతో నిర్వహించనున్న మహా పాదయాత్రలో ఆయన పాల్గొంటారని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు మద్దతుగా లక్ష మందికి పైగా ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొనబోతున్నారని చెప్పారు. ఓటర్ల జాబితా సవరణపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారానికి ఈ పాదయాత్ర సమాధానంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
ఆదివారం 22 నవంబర్ 2026

ఉచితంగా ఇండియన్ జాగ్రఫీ పుస్తకాల పంపిణీ



ముషీరాబాద్, (ప్రజావినికిడి): పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు సిటీ సెంటర్ లైబ్రరీలో మిషన్ టిజిపిఎస్సి ఇండియన్ జాగ్రఫీ పుస్తకాలను నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ నాయక్ ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి నల్గొండ వరంగల్ ఖమ్మం పట్టబద్రుల స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి పరికరాల నరేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ, సమయాన్ని సద్వినియోగం చేసుకొని అభ్యర్థులు తమ లక్ష్యాలను నెరవేర్చు కోవాలని తెలియజేశారు. ఇప్పటికీ మిషన్ టిజిపిఎస్సి ఎన్నో పుస్తకాలను అందించిన పుస్తక రచయిత అనిల్ కుమార్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నిరుద్యోగ జేఏసీ పట్టభద్రుల స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి నరేష్ మాట్లాడుతూ, పోటీ పరీక్షల అభ్యర్థులు చదివిన అంశాలను నిరంతరం ప్రాక్టీస్ చేస్తూ తమ లోపాలను సరిదిద్దుకోని వాటిపై పట్టు సాధించాలని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పుస్తక రచయిత అనిల్ కుమార్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నిరుద్యోగ జేఏసీ నేత రవి యాదవ్ మాట్లాడుతూ, ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ అభ్యర్థులు సమయంలో ఒత్తిడికి లోనవ్వకుండా మానసికంగా ధైర్యంగా ఉండాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ నేతలు దామోదర్ రెడ్డి, కుమార్ రాథోడ్, రవి నాయక్, సవాయ్ సింగ్, వేణు,ప్రశాంత్, అనిల్ కుమార్ గౌడ్,హర్షిత,వీర తదితరులు పాల్గొన్నారు.

పెద్ద అంబర్ పేట డివిజన్ లో రుద్ర టిఫిన్ సెంటర్ ప్రారంభోత్సవం



రంగారెడ్డి,(ప్రజావినికిడి):
అబ్దుల్లాపూర్ మెట్టు మండలం పెద్ద అంబర్ పేట డివిజన్ లో రుద్ర టిఫిన్ ప్రారంభోత్సవం చేసిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఈ సందర్భంగా నిర్వాహకులు యు.శ్రీనివాస్ గౌడ్ డి. మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ, రుచి సూచి క్వాలిటీ శుభ్రత పాటించడమే మా లక్ష్యం అని అన్నారు.రుచి నాణ్యత విషయంలో రాజి పడేది లేదన్నారు.మీ అందరి ఆశీర్వాదంతో రుద్ర టిఫిన్స్ ను ఎల్లప్పుడూ ఆశీర్వదించాలని కోరుతున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో గంట లక్ష్మారెడ్డి పెద్ద అంబర్ పేట మాజీ కౌన్సిలర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు పసుల కుమార్ బిల్డింగ్ ఓనర్ వివిధ మాజీ కౌన్సిలర్లు కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

షాద్‌నగర్‌లో కార్తీక కోటి దీపోత్సవానికి మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డికి ఆహ్వానం



షాద్‌నగర్:(ప్రజావినికిడి):పట్టణంలోని గౌరీ గార్డెన్ ఎదురుగా ఉన్న ఆకుల మనయ్య గ్రౌండ్‌లో నవంబర్ 26, 27,28 తేదీలలో నిర్వహించనున్న కార్తీక దీపోత్సవ కార్యక్రమాలకు మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డిని నిర్వాహకులు ఆహ్వానించారు.అలాగే నవంబర్ 29న నిర్వహించనున్న శ్రీ అయ్యప్ప స్వామి మహాపడి పూజ కార్యక్రమానికి కూడా ఆహ్వానం అందజేశారు.ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు కోటి దీపోత్సవ కమిటీ సభ్యులు సింగారం శ్రీనివాస్,తదితరులు తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.ఈ సందర్భంగా తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి మాట్లాడుతూ,కార్తీక మాసంలో నిర్వహించే ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు మన సంస్కృతి,సంప్రదాయాలు,భక్తి భావాలను పెంపొందిస్తాయని అన్నారు. షాద్‌నగర్ పట్టణ ప్రజలు,భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్తీక దీపోత్సవం,శ్రీ అయ్యప్ప స్వామి మహాపడి పూజ కార్యక్రమాల్లో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలనికోరారు.నిర్వాహకులు చేపట్టిన ఈ పవిత్ర కార్యక్రమానికి ప్రజలందరూ తమ వంతు సహకారం అందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.కార్తీక దీపాల వెలుగులతో,అయ్యప్ప స్వామి భక్తి పారవశ్యంతో నిర్వహించనున్న ఈ వేడుకలు షాద్‌నగర్‌లో ఆధ్యాత్మిక శోభను సంతరించుకోనున్నాయి అన్నారు.

షాద్ నగర్ రియల్ ఎస్టేట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎం.శివాజీ ఘన విజయం

నూతన కార్యవర్గానికి రియల్ ఎస్టేట్ వర్గాల ఘన సన్మానం



నియామక పత్రం అందుకుంటూనా శివాజీ



షాద్ నగర్,(ప్రజావినికిడి):సాధారణ ఎన్నికలను తలపిస్తూ తీవ్ర ఉత్కంఠ రేకెత్తించిన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణ రియల్ ఎస్టేట్ అసోసియేషన్ ఎన్నికల సమరం ముగిసింది.అత్యంత ప్రతిష్టాత్మకమైన అధ్యక్ష పదవికి ఎండి.కబీర్ హైమద్‌తో జరిగిన హోరాహోరీ పోరులో ఎం.శివాజీ 68 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు.బ్యాలెట్ పద్ధతిలో,ఎన్నికల అధికారి పర్యవేక్షణలో అత్యంత పారదర్శకంగా జరిగిన ఈ ఎన్నికల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు శివాజీ ప్యానెల్‌కే పట్టం కట్టారు.ప్రశాంతంగా ముగిసిన ఎన్నికల ప్రక్రియ ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలులేకుండాప్రశాంతంగా,విజయవంతంగాపూర్తయింది.పోలింగ్,కౌంటింగ్ సరళిని ఎన్నికల ఏజెంట్లు బండారి ప్రవీణ్ కుమార్,విశ్వనాధ్ తదితరులు నిశితంగా పర్యవేక్షించారు.తుది ఫలితాలు వెలువడగానే శివాజీ మద్దతుదారులు బాణాసంచా కాల్చి,మిఠాయిలు పంచుకుని ఘనంగా విజయోత్సవ సంబరాలు చేసుకున్నారు.**నూతన కార్యవర్గం**అధ్యక్షుడు ఎం.శివాజీ తో పాటు నూతన కార్యవర్గ సభ్యులుగా ఉపాధ్యక్షుడు శంకర్,జనరల్ సెక్రెటరీ సతీష్,జాయింట్ సెక్రెటరీ షబ్బీర్ ఉద్దీన్,ట్రెజరర్ చాకలి మురళి,సతీష్ కుమార్, ఎండి.సాదిక్ తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,నాపై నమ్మకంతో 68 ఓట్ల మెజారిటీతో మా ప్యానెల్‌ను గెలిపించిన ప్రతి ఒక్క రియల్ ఎస్టేట్ సోదరులకి హృదయపూర్వక కృతజ్ఞతలుతెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంక్షేమం,సమస్యల పరిష్కారమే నా ప్రథమ కర్తవ్యం ముందుకు సాగుతానని నూతన అధ్యక్షుడు ఎం.శివాజీ తెలిపారు.

చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఘనంగా పల్లకీ సేవ



షాద్ నగర్,(ప్రజావినికిడి):మున్సిపాలిటి పరిధిలోని సోలిపూర్ చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజన భక్త బృందం సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు.శ్రీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని పల్లకిలో మోస్తూ శ్రీరామ జయరామ, జయ జయ రామ నినాదాలతో ఆట పాటలతో, భజనలతో భక్తులు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. భక్తి పాటలు భజనలతో ఆలయంలో
శ్రీ రామ నామస్మరణతో మార్మోగింది. ఆలయ ప్రధాన అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్రాచార్య,అర్చకులు, ప్రమోద్,సునీల్ పంతులు ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం కొత్తూరు కు చెందిన జాండగూడెం రామకృష్ణ గౌడ్ మరియు పట్టణానికి చెందిన అంబదాస్ కలిసి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేసిన రామకృష్ణ గౌడ్ మరియు అంబదాస్ లను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో భక్తులు,భజన భక్త బృందం మహిళలు తదితరులు పాల్గొన్నారు.

జానంపేట శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో గోశాల, యాగశాల ప్రారంభం

ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు

షాద్ నగర్,(ప్రజావినికిడి):ఆధ్యాత్మికతకు ఆలయాలు నిలయాలని,భక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు ధార్మిక సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో దేవాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని షాద్‌నగర్ ఎమ్మెల్యే,రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు.మున్సిపాలిటీ పరిధిలోని జనంపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన గోశాలను,దాత మాజీ ఎంపీపీ మంచనపల్లి ప్రియాంకశివశంకర్ గౌడ్ దంపతుల ఆర్థిక సహకారంతో నిర్మించిన యాగశాలను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఆలయ ధర్మకర్త,మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలుతో కలిసి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముందుగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య జరిగిన ఈ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆలయాల అభివృద్ధికి,ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు దాతలు





ముందుకు రావడం అభినందనీయమన్నారు.గోశాల ఏర్పాటు ద్వారా గోవుల సంరక్షణకు మరింత అవకాశం కలుగుతుందని,యాగశాల నిర్మాణంతో ఆలయంలో యజ్ఞయాగాదులు,ఇతర ధార్మిక కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. సమాజంలో దాతృత్వం, భక్తిభావం,సేవా దృక్పథం మరింత పెరగాలని ఆకాంక్షించారుఆలయ అభివృద్ధికి ఆర్థిక సహకారం అందించిన మంచనపల్లి ప్రియాంక శివశంకర్ గౌడ్ దంపతులను పలువురు అభినందించారు.దైవ కార్యాలకు తమ వంతు సహకారం అందించడం సంతోషకరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్,నాయకులు, వ్యాపారవేత్తలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ముట్టడి జయప్రదం చెయ్యండి



వాజేడు,నవంబర్ 22,(ప్రజావినికిడి):5 వ షెడ్యూల్డ్ ప్రాంత చట్టాలను పూర్తి స్థాయిలో అమలు చేయుటకై,నవంబర్ 30 ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో వెంకటాపురం మండలం తాసిల్దార్ కార్యాలయం ముట్టడి ప్రచారంలో భాగంగా శనివారం నాడు ఆదివాసి సంఘాల కార్యచరణ వేదికగా కరపత్రం ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు మాట్లాడుతూ.1/70 చట్టం ఐదో షెడ్యూల్ లో ఉన్న ఆదివాసీల భూములకు రక్షణ కోసమే కాదని,ఆదిమ తెగల ఆస్తిత్వానికి, ఆదివాసీల సంస్కృతీ, సంప్రదాయాలను,వాటి ఉనికిని కాపాడడానికి వచ్చిన,రాజ్యాంగ బద్ధమైన చట్టమని అన్నారు.నేడు ఈ చట్టానికి ఆదివాసీల ఉనికికి ప్రమాదం ఏర్పడే విధంగా గిరిజనేతరులు 1/70 చట్టాన్ని తీసివేయాలని కోర్టును ఆశ్రయిస్తున్నారని,ఇది ఆదివాసి సమాజం గమనించాలని అన్నారు.దీని పై ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకుండా ముందడుగు వేయకుండా మౌనంగా ఉంటోందని, ప్రభుత్వ మౌనం ఆదిమ తెగల ఆస్థిత్వానికి పెనుముప్పు ఏర్పడుతుందని,ఐదో షెడ్యూల్ భూభాగంలోని ఖనిజ సంపదను దోచుకు తినడానికి ఈనాడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని,దిన్ని ఆదివాసి సమాజం గమనించాలని నాయకులు అన్నారు.ఒక 1/70 చట్టం మాత్రమే కాదు, పెసా,అటవీ హక్కుల గుర్తింపు చట్టాలు కూడా అమలుకు నోచుకోవడం లేదని.మనం ఇలాగే ప్రభుత్వ విధానాలను ప్రశ్నించక పొతే మన మౌనమే మనకు భవితరాలకు మరణ శాసనం కాబోతోంది ఆవేదన వ్యక్తం చేశారు.నేడు ఆ చట్టాల ఉనికి ప్రమాదం ఏర్పడ్డది.వారి వారసులుగా , వాడిరి ఆశయాలను సాధిద్దాం.రాజకీయ పార్టీలకు అతితంగా మన మౌన సంకెళ్లు తెంచుకోని నవంబర్ 30న ఆదివాసీ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ తలపెట్టిన వెంకటాపురం తహసీల్దార్ కార్యాలయం ముట్టడి కార్యక్రమానికి ఆదివాసి ప్రజలు,ప్రజా స్వామిక వాదులు,ప్రజా ప్రతినిధులు,మేధావులు వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు.ఈ కరపత్ర ఆవిష్కరణలో తుడుం దెబ్బ,జాతీయ నాయకులు యాసం రాజు,జిల్లా అధ్యక్షుడు సిద్ధబోయిన సర్వేశ్వరరావు,బొగ్గుల బిక్షపతి,మండల అధ్యక్షుడు కణితి వెంకటకృష్ణ,ఆదివాసి నవ నిర్మాణసేన,రాష్ట్ర అధ్యక్షుడు కోర్స నరసింహమూర్తి,వర్కింగ్ ప్రెసిడెంట్ వాసం నాగరాజు,జిల్లా కన్వీనర్ కుంజ మహేష్, ఉపాధ్యక్షుడు కంతి విజయ్,గొండ్వానా సంక్షేమ పరిషత్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి,జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్,మండల నాయకులు పూనెం నితిన్,బి.నరసింహమూర్తి, ఆదివాసి సంక్షేమ పరిషత్,ములుగు జిల్లా కన్వీనర్ పర్షిక సతీష్,మండల అధ్యక్షుడు తుర్స కృష్ణ బాబు,తుర్స ప్రశాంత్,సూర్యే తదితరులు పాల్గొన్నారు

ఘనంగా ప్రపంచ మత్స్యకార దినోత్సవం

వాజేడు,నవంబర్ 22,(ప్రజావినికిడి):



ములుగు జిల్లా వాజేడు మండలం పేరూరు, చిన్నగొల్లగూడెం రాంపురం గ్రామంలో శనివారం వాడబలిజ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు డర్ర దామోదర్ ఆదేశాల మేరకు తోనూరి రవి చంటి ఆధ్వర్యంలో రాష్ట్ర యూత్ అధ్యక్షులు బొల్లె ఆదినారాయణ చేతుల మీదుగా జండా ఎగరవేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సాయి ప్రవీణ్ నరేష్ సతీష్ లాలయ్య వెంకన్న జగన్ స్వామి మహిళలు సమ్మక్క రామక్క మహిళలు పాల్గొన్నారు అనంతరం చిన్నగొల్లగూడెం, రాంపురం, గ్రామంలో గ్రామ అధ్యక్షులు ఆధ్వర్యంలో జెండా ఎగురవెయ్యడం ఉత్సాహంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం నిర్వహించి జెండా ఎగురవేశారు మిఠాయిలు పంచుకొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియపరచుకున్నారు రాష్ట్ర యూత్ అధ్యక్షులు మాట్లాడుతూ, వాడబలిజలం అందరం ఐక్యతతో ఉండాలి మనమందరం ఐక్యతతో ఉంటేనే మనకు రాబోయే రోజుల్లో రావలసిన గవర్నమెంట్ నుంచి నిధులు కావచ్చు బీసీ ఫండ్స్ కావచ్చు ఇటువంటి వాటికోసం మనం పోరాటం చేయాలి కాబట్టి మనమందరం ఐక్యతతో ఉంటేనే రాజకీయ రంగంలో తదితర రంగాల్లో మనని గుర్తించే విధంగా మనమందరం ఐక్యంగా పోరాడుదాం అని అన్నారు.ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం నిర్వహించి మిఠాయిలు పంచుకొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కుంట నర్సింహారావు, సంతోష్, సమ్మయ్య,డి. సంతోష్,కౌశల్య, తదితరులు పాల్గొన్నారు

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

రంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు పారి జాత కు హర్షలత సన్మానం..



ఎల్బీనగర్, (ప్రజావినికిడి): కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా నియమితులైన చిగురింత పారిజాత నర్సింహారెడ్డిని శనివారం డీసీసీ ప్రధాన కార్యదర్శి తమలపాకుల హర్షలత మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పారిజాతను శాలువాతో సత్కరించి శు భాకాంక్షలు తెలిపారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కలసి కట్టుగా పనిచేయాలని పారిజాత పిలుపునిచ్చినట్లు హర్షలత తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో జర్నలిస్టుల పాత్ర కీలకం..

ఉత్తమ జర్నలిస్టు అవార్డు పొందిన రమేష్‌ను అభినందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..



షాద్‌నగర్,(ప్రజావినికిడి):ప్రజా సమస్యలను వెలికితీసి,వాటి పరిష్కారం కోసం జర్నలిస్టులు నిరంతరం ముందుండాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ప్రజల గొంతుకగా నిలుస్తూ సమాజంలో జరుగుతున్న సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. శనివారం షాద్‌నగర్ పట్టణంలోని తన స్వగృహంలో ఉత్తమ జర్నలిస్టు అవార్డు పొందిన రమేష్‌ను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యలను గుర్తించి వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఉత్తమ జర్నలిస్టుగా అవార్డు అందుకోవడంశీ రమేష్‌కు మాత్రమే కాకుండా జర్నలిస్టు వృత్తికి కూడా గర్వకారణమని అన్నారు. నిజాయితీ, నిబద్ధతతో వార్తా కథనాలు అందిస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలవాలని జర్నలిస్టులకు సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఉత్తమ జర్నలిస్టు అవార్డు పొందిన రమేష్‌ను ఎమ్మెల్యే అభినందించడం పట్ల పలువురు జర్నలిస్టు మిత్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు సత్యనారాయణ, రమేష్, ఆలుగొండ శ్రీనివాస్, వాయిడ్,సవాళ్ల రాజు,వెంకటేష్ గౌడ్,రత్నం లు ఉన్నారు.


తప్పిపోయిన చిన్నారుల కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..



నాగోల్,(ప్రజావినికిడి):నాగోల్ డివిజన్ పరిధిలోని సాయిరాం నగర్ కాలనీలో నివాసముండే రవి,శిరీష దంపతుల కుమారులు వరుణ్ తేజ్(8 సంవత్సరాలు) మహేష్(6 సంవత్సరాలు)
గత అక్టోబర్ 31వ తేదీ నుంచి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతూ స్థానిక నాగోల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగింది.ఈ విషయం తెలుసుకున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి చిన్నారుల నివాసానికి వెళ్లి వారి తల్లిదండ్రులను పరామర్శించి,ధైర్యం చెప్పారు.అనంతరం నాగోల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మక్బూల్ జానీ తో మాట్లాడుతూ, తప్పిపోయిన చిన్నారుల ఆచూకీని వీలైనంత త్వరగా గుర్తించి వారిని క్షేమంగా తల్లిదండ్రుల వద్దకు చేర్చేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు.చిన్నారుల కోసం ఎదురుచూస్తున్న తల్లిదండ్రుల ఆవేదనను అర్థం చేసుకొని,వారికి త్వరగా ఊరట కలిగించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పి.ఎం.ఆర్.రాజు,సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

నర్కుడలో ఇందిరమ్మ జీవిత బీమా పథకం ప్రారంభం

అర్హులందరూ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి: సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్





శంషాబాద్, (ప్రజావినికిడి): నవంబర్ 21, శంషాబాద్ మండల పరిధిలోని నర్కుడ గ్రామంలో తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని శనివారం ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్, డీఎల్‌పీఓ శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి పథకాన్ని ప్రారంభించారు.
ఈ సందర్భంగా సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ జీవిత బీమా పథకం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని,ఈ పథకంపై గ్రామ ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని కోరారు.అర్హులైన ప్రతి ఒక్కరూ పథకం ద్వారా లబ్ధి పొందేలా చూడాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నీరటి మహేష్, పంచాయతీ కార్యదర్శి రంజిత్,వార్డు సభ్యులు పర్వతం వెంకటయ్య, నాయకులు తొంట అశోక్, రక్షిత్ గౌడ్, గూడెపు లక్ష్మణ్ తదితరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండండి..

బంగారు భవిష్యత్తును నిర్మించుకోండి

సైబర్ నేరాలు,డ్రగ్స్‌పై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

ముఖ్య అతిథి గా షాద్ నగర్ పట్టణ సీఐ సీతారాం





షాద్‌నగర్,(ప్రజావినికిడి):
పట్టణంలోని బుగ్గారెడ్డి గార్డెన్స్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డ్రగ్స్,మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సైబర్ క్రైమ్,షీ టీమ్స్ ప్రతినిధులతో పాటు పట్టణ సీఐ సీతారాం,పలువురు అధికారులు హాజరై విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పట్టణ సీఐ సీతారాం మాట్లాడుతూ,
విద్యార్థులు విద్యాభ్యాసం కోసంకళాశాలలకు వస్తున్నారని,అయితే కొంతమంది ఫ్యాషన్, స్నేహితుల ప్రభావంతో డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.విద్యార్థులు ఇలాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. తమ స్నేహితుల్లో ఎవరైనా డ్రగ్స్ తీసుకుంటున్నట్లు లేదా విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే ఉపాధ్యాయులు,ప్రధానోపాధ్యాయులకు సమాచారం అందించాలని కోరారు.నేరుగా చెప్పడానికి భయపడితే 112 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వవచ్చని, సమాచారమిచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.డ్రగ్స్,గంజాయి కలిగి ఉండటం, వినియోగించడం, విక్రయించడం వంటి నేరాలకు పాల్పడితే ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.
నేర తీవ్రతను బట్టి దీర్ఘకాలిక జైలు శిక్షలు పడే అవకాశం ఉందని తెలిపారు.సాధారణ కేసులతో పోలిస్తే డ్రగ్స్ కేసుల్లో బెయిల్ పొందడం కూడా కష్టతరమని వివరించారు.
తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈగల్ టీమ్‌తో పాటు పోలీసులు మత్తు పదార్థాల అక్రమ రవాణా,విక్రయాలపై నిరంతరం నిఘా ఉంచుతున్నారని పేర్కొన్నారు.
పోలీసుల కంటపడకుండా అక్రమ కార్యకలాపాలకు పాల్పడవచ్చని ఎవరూ భావించవద్దని హెచ్చరించారు.
సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి
ప్రస్తుత కాలంలో సెల్‌ఫోన్ల వినియోగం పెరిగిన నేపథ్యంలో సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సీఐ సూచించారు.
ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా జరిగే మోసాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని,గుర్తుతెలియని వ్యక్తులు పంపే అనుమానాస్పద లింక్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయవద్దని సూచించారు.
ఆన్‌లైన్ లోన్ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకుంటే వ్యక్తిగత సమాచారం,ఫొటోలు, వీడియోలను సేకరించి బ్లాక్‌మెయిల్ చేసే ప్రమాదం ఉందనిహెచ్చరించారు.తల్లిదండ్రులకు ఆరోగ్యం బాగోలేదని,మిమ్మల్ని అరెస్ట్ చేస్తామని,సీబీఐ విచారణ జరుగుతుందని బెదిరిస్తూ వచ్చే నకిలీ ఫోన్ కాల్స్‌ను నమ్మవద్దన్నారు. అలాంటి కాల్స్ వస్తే భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని, అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేయాలని సూచించారు.
మహిళలు,బాలికలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా షీ టీమ్స్‌ను సంప్రదించి సహాయం పొందవచ్చని తెలిపారు. విద్యార్థులు క్యాటరింగ్ వంటి చిన్నచిన్న పనుల కోసం వెళ్లి చదువును నిర్లక్ష్యం చేయకుండా విద్యాభ్యాసంపైనే పూర్తి దృష్టి సారించాలని సూచించారు.ఈ సందర్భంగా ఇతర అధికారులు మాట్లాడుతూ, యువత డ్రగ్స్,గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవితాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.ముఖ్యంగా విద్యార్థినులు ఎలాంటి వేధింపులు లేదా సమస్యలు ఎదుర్కొన్నా భయపడకుండా షీ టీమ్స్‌కు సమాచారం అందించాలని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ సీతారాం,సైబర్ వారియర్ శ్రీనివాస్,రాజు అనిల్,షాద్ నగర్ షీ టీం,ఎస్సై దర్మీయా రాథోడ్, పిసి రేష్మ,గీత మరియు మోటివేషన్ స్పీకర్ మహేష్,ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి వడ్ల శ్రీకాంత్,ఎస్ఎఫ్ఐ టౌన్ ఉపాధ్యక్షులు అదిల్,రామ్ చరణ్,శివ గౌడ్, వంశీ,తరుణ్,కార్తీక్,విష్ణువర్ధన్, చంద్రకాంత్ రెడ్డి,అబ్దుల్,సాయి గౌడ్,రాహుల్, శివ,సాయి,బబ్లు, బన్నీ,యశ్వంత్,అశ్విక్ మరియు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

తొండుపల్లి చెరువు ఎఫ్‌టీఎల్‌లో హైడ్రా కూల్చివేతలు..

75ఎకరాల భూమి స్వాధీనం.. చుట్టూ కంచె ఏర్పాటు.. - వ్యవసాయదారుల భూములపైనే చర్యలా.?

బడా వ్యాపారుల గోదాములు కనిపించడం లేదా:స్థానికుల ఆగ్రహం..







శంషాబాద్, (ప్రజావినికిడి): నవంబర్ 21, రంగారెడ్డి జిల్లా శంషాబాద్ జీహెచ్ఎంసీ పరిధిలోని తొండుపల్లి చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో హైడ్రా అధికారులు ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టారు. చెరువుకు సంబంధించిన ఎఫ్‌టీఎల్ పరిధిలో సుమారు 75 ఎకరాల భూమి ఆక్రమణకు గురైందని ఫిర్యాదులు అందడంతో అధికారులు రంగంలోకి దిగారు. ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ హైడ్రా బృందం జేసీబీ యంత్రాల సహాయంతో కూల్చివేతలు చేపట్టింది. అనంతరం గుర్తించిన భూమిని తమ ఆధీనంలోకి తీసుకుని చుట్టూ కంచె ఏర్పాటు చేసే పనులు ప్రారంభించింది. ఎఫ్‌టీఎల్ పరిధిలో వ్యవసాయం చేసుకోవడానికి అవకాశం ఉన్నప్పటికీ ఇతర నిర్మాణాలు చేపట్టడానికి నిబంధనలు అనుమతించవు. ఈ నిబంధనలకు విరుద్ధంగా కొందరు నిర్మాణాలు చేపట్టినట్లు అధికారులకు ఫిర్యాదులు అందాయి.దీంతో ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల సమక్షంలో హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టారు. చెరువు భూములను పరిరక్షించడంతో పాటు భవిష్యత్తులో ఆక్రమణలు జరగకుండా ఉండేందుకు సుమారు 75 ఎకరాల భూమి చుట్టూ కంచె ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొంటున్నారు.

వ్యవసాయదారులపైనే ప్రతాపమా.?

మరోవైపు హైడ్రా అధికారులు చేపట్టిన చర్యలపై స్థానిక రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న భూముల విషయంలో అధికారులు వ్యవసాయదారులపైనే చర్యలు తీసుకుంటున్నారని,అదే ప్రాంతంలో ఉన్న వ్యాపార సంస్థలు, గోదాముల విషయంలో మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. తొండుపల్లి చెరువు పరిసరాల్లో 75 ఎకరాల భూమికి కంచె ఏర్పాటు చేస్తున్న అధికారులకు పక్కనే ఉన్న వ్యాపారుల గోదాములు ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నిస్తున్నారు.

బడాబాబులకు ఒక న్యాయం.. రైతులకు మరో న్యాయమా.?

ఎస్సీ,ఎస్టీ,బీసీ వర్గాలకు చెందిన చిన్న, సన్నకారు రైతుల భూములపై అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించే రైతుల భూముల విషయంలో వేగంగా చర్యలు తీసుకుంటున్న అధికారులు, బడా వ్యాపారుల నిర్మాణాలు, గోదాముల విషయంలో ఎందుకు అదే స్థాయిలో స్పందించడం లేదని నిలదీస్తున్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి నిర్మాణాలు ఉన్నా వాటిపై సమానంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. చెరువుల పరిరక్షణకు ఆక్రమణల తొలగింపు అవసరమేనని, అయితే ఆ పేరుతో పేద, మధ్యతరగతి రైతులకు మాత్రమే నష్టం కలిగించేలా చర్యలు ఉండకూడదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఒకవేళ వ్యాపార సంస్థల గోదాములు కూడా ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉంటే వాటిపై కూడా విచారణ జరిపి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. హైడ్రా అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై స్థానికులు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు.

బాలల హక్కుల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

ప్రభుత్వ శాఖలతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలి - డా.మహమ్మద్ ఇమ్రాన్

శంషాబాద్, (ప్రజావినికిడి): నవంబర్ 21, శంషాబాద్ మండల పరిధిలోని నర్కుడ గ్రామంలో తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని శనివారం ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్, డీఎల్‌పీఓ శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి పథకాన్ని ప్రారంభించారు.
ఈ సందర్భంగా సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ జీవిత బీమా పథకం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని,ఈ పథకంపై గ్రామ ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని కోరారు.అర్హులైన ప్రతి ఒక్కరూ పథకం ద్వారా లబ్ధి పొందేలా చూడాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నీరటి మహేష్, పంచాయతీ కార్యదర్శి రంజిత్,వార్డు సభ్యులు పర్వతం వెంకటయ్య, నాయకులు తొంట అశోక్, రక్షిత్ గౌడ్, గూడెపు లక్ష్మణ్ తదితరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శంషాబాద్, (ప్రజావినికిడి):
బాలల హక్కుల పరిరక్షణ కేవలం ప్రభుత్వ శాఖల బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములైనప్పుడే చిన్నారులకు సురక్షితమైన భవిష్యత్తును అందించగలమని ప్రముఖ బాలల హక్కుల కార్యకర్త డా.మహమ్మద్ ఇమ్రాన్ అన్నారు. అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నవంబర్ 20న రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం నర్కుడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డా.మహమ్మద్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డా. మహమ్మద్ ఇమ్రాన్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో బాలలకు ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటి



పరిష్కారానికి సమర్థవంతమైన బాలల రక్షణ వ్యవస్థలను బలోపేతం చేయాలని సూచించారు. బాల కార్మికత్వం, బాల్యవివాహాలు, చిన్నారులపై హింస వంటి సమస్యలను అరికట్టేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ శాఖలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.పిల్లలు తమ హక్కులను తెలుసుకోవడంతో పాటు, తమకు ఎదురయ్యే సమస్యలను ఎలాంటి భయం లేకుండా తెలియజేసే వాతావరణాన్ని కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు సారిత గోగుల మాట్లాడుతూ, ప్రతి చిన్నారికి విద్య,ఆరోగ్యం, రక్షణ, సమానత్వం, గౌరవంతో కూడిన బాల్యాన్ని అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. బాలల హక్కులకు సంబంధించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పోలీసు శాఖ ప్రతినిధులు, ఇతర ఆహ్వానితులు పాల్గొన్నారు.

మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ బాలికల కమిటీ ఎన్నిక



హయత్ నగర్,(ప్రజావినికిడి):
పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు,మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా హయత్ నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాలికల కమిటీ ఎన్నిక నిర్వహించడం జరిగింది.మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ హయత్ నగర్ మండల అధ్యక్షుడు కొమ్ము శివ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహాజన సోషలిస్టు పార్టీ (ఏంఎస్ పి) ఎల్బీనగర్ ఇంచార్జ్ ఎర్ర రవీందర్ మాదిగ, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఎల్బీనగర్ ఇంచార్జ్ కొమ్ము రాజశేఖర్ మాదిగ,సహ ఇంచార్జ్ క్యాదాస్ సతీష్ మాదిగ హాజరై విద్యార్థులకు నియామక పత్రాలు అందజేశారు. **నూతన కమిటీ.**అధ్యక్షురాలు – కె.భవ్య శ్రీ ప్రధాన కార్యదర్శి –కె.నందిని ఉపాధ్యక్షురాలు – ఎం.ఝాన్సీ అధికార ప్రతినిధి –ఎ.హిందూ ప్రధాన కార్యదర్శి (2)–కె.కావ్య శ్రీ ఉపాధ్యక్షులు (2) –ఎం.హారిక కోశాధికారి–ఎం. హిందూ కార్యదర్శులు జె.రాజేశ్వరి,బి. శ్వేతా మాదిగ, జి.శివరాంజని మాదిగ,ఇ.వర్షితఈ కార్యక్రమంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి సీనియర్ నాయకులు అనంత నరసింహ, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ అబ్దుల్లాపూర్ మెట్ మండల అధ్యక్షుడు జె. చరణ్ మాదిగ, విద్యార్థులు పాల్గొన్నారు

హైదరాబాద్‌లో నాలుగు హోటళ్ల లైసెన్సులు రద్దు..

నవంబర్ 21: (ప్రజావినికిడి):
హైదరాబాద్ నగరంలోని ప్రముఖ రెస్టారెంట్లలో ఆహార భద్రతా నిబంధనల ఉల్లంఘనలపై తెలంగాణ ఫుడ్ సేఫ్టీ అధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. వినియోగదారుల ఆరోగ్యానికి ముప్పు కలిగించేలా తీవ్ర లోపాలకు పాల్పడిన నాలుగు హోటళ్ల ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులను తక్షణమే సస్పెండ్ చేశారు. వీటితో పాటు అనుమతులు లేకుండా నడుస్తున్న ఒక హాస్టల్, బేకరీలను మూసివేయించారు.లైసెన్సులు రద్దయిన వాటిలో మాదాపూర్ అయ్యప్ప సొసైటీలోని 'మాదాపూర్ బావర్చి', కూకట్‌పల్లిలోని 'ది స్పైస్ కిచెన్', టోలిచౌకిలోని 'మతామ్ అల్ యమాని అరేబియన్ రెస్టారెంట్', చందానగర్‌లోని 'అన్నపూర్ణ క్యాటరర్స్' ఉన్నాయి. ఈ నాలుగు సంస్థలు తమ వ్యాపార కార్యకలాపాలను తక్షణమే నిలిపివేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.ఈ హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో తీవ్రమైన అపరిశుభ్ర పరిస్థితులు వెలుగుచూశాయి. వంటగదుల్లో బొద్దింకలు, ఎలుకల విసర్జితాలు సంచరిస్తున్నట్లు గుర్తించారు. ఫ్రిడ్జ్‌లలో శాకాహారం, మాంసాహారాన్ని నిబంధనలకు విరుద్ధంగా కలిపి నిల్వ ఉంచడం, నాసిరకం సింథటిక్ ఫుడ్ కలర్స్ వినియోగించడం, కిచెన్ నేలలు దెబ్బతినడం, గోడలు పొగతో నిండి ఉండటం వంటి సమస్యలు కనిపించాయి. అంతేకాకుండా, ఆహారాన్ని తయారుచేసే సిబ్బందికి ఎలాంటి వైద్య పరీక్షల ధ్రువపత్రాలు లేవని తనిఖీల్లో తేలింది.మరోవైపు, కనీస ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులు లేదా రిజిస్ట్రేషన్లు లేకుండా నిర్వహిస్తున్న టోలిచౌకిలోని 'అల్ కరీమ్ బేకర్స్', గౌళిదొడ్డిలోని 'శ్రీ లక్ష్మి లగ్జరీ మెన్స్ హాస్టల్'లను కూడా అధికారులు మూసివేయించారు.ఈ సోదాల సందర్భంగా కల్తీ జరిగినట్లు అనుమానం ఉన్న 8 ఆహార నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపారు. దాదాపు 135 కిలోల నాణ్యతలేని ఆహార పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. రాజు గారి బిర్యానీ, స్వాద్ స్పైసీ రెస్టారెంట్లకు త్వరలోనే షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నారు. మెహఫిల్ రెస్టారెంట్‌కు లోపాలను సరిదిద్దుకోవాలని 'ఇంప్రూవ్‌మెంట్ నోటీసు' ఇచ్చి, త్వరలోనే రీ-ఇన్‌స్పెక్షన్ చేయనున్నట్లు వెల్లడించారు.

ఇంత దుర్మార్గమా

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై తీవ్రస్థాయిలో మండిపడ్డ జగన్



అమరావతి నవంబర్ 21(ప్రజావినికిడి):
ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై వైసీపీ అధినేతజగన్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మున్సిపల్, జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలతో పాటు ప్రస్తుతం పార్టీ రహితంగా జరుగుతున్న పంచాయతీ ఎన్నికలను కూడా అధికార కూటమి రిగ్గింగ్ చేస్తోందని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో అసలు ప్రజాస్వామ్య సూత్రాలే అమలు కావడం లేదని, ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచేలా ప్రస్తుత పరిస్థితులు ఉన్నాయని ఆయన సోషల్ మీడియా వేదికగా విమర్శించారు. హే రామ్.. ఆంధ్రప్రదేశ్ ను కాపాడు అంటూ ట్వీట్ చేశారు.
ప్రస్తుతం రాష్ట్రంలో 'ఫ్రీ అండ్ ఫెయిర్' ఎన్నికలు నిర్వహించాల్సిన పరిస్థితులు పూర్తిగా కనుమరుగయ్యాయని జగన్ ఆరోపించారు. విపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వకుండా అడ్డుకోవడమే కాకుండా, దాఖలు చేసిన నామినేషన్ పత్రాలను అధికారులే నేరుగా చించివేశారని ఆయన ఆరోపించారు. పోలింగ్ కేంద్రాలను ఆక్రమించి ఓట్లను అపహరిస్తున్నారని, చివరకు ఎన్నికల్లో గెలిచిన వారిని కూడా ఓడినట్లుగా ప్రకటిస్తున్నారని పేర్కొన్నారు. రిటర్నింగ్ అధికారులు (ఆర్వోలు), పోలీసులు, అధికార పార్టీ నాయకులు కుమ్మక్కై ఫలితాలను ప్రభావితం చేస్తున్నారని, ఎన్నికల సంఘం కూడా అధికార పార్టీ చర్యలను అడ్డుకోవడంలో విఫలమైందని జగన్ విమర్శించారు.
గత ఐదేళ్ల తమ పాలనలో రాష్ట్రం ఎంతో సుస్థిరంగా, ప్రశాంతంగా సాగిందని, కానీ ప్రస్తుత ప్రభుత్వ హయాంలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటూ వ్యవస్థలు పూర్తిగా భ్రష్టుపట్టాయని జగన్ పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిలపై జరిగిన హత్యాయత్నాల ఘటనలే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. తాడిపత్రిలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటిపై స్థానిక టీడీపీ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు పెద్ద సంఖ్యలో దాడికి దిగారని, పోలీసుల ముందే వాహనాలకు నిప్పంటించి చంపే ప్రయత్నం చేశారని జగన్ ఆరోపించారు. ఇలాంటి దారుణాలకు పాల్పడిన వారికి ప్రభుత్వం కొమ్ముకాస్తూ, బాధితులపైనే అక్రమ కేసులు నమోదు చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.
ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ ఎన్నికల్లో చోటుచేసుకున్న ఘటనలకు సంబంధించిన పలు వీడియోలను వైఎస్ జగన్ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా పంచుకున్నారు. రాష్ట్రంలో పరిస్థితి దారుణంగా ఉందని పేర్కొంటూ, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ జగన్ తన పోస్ట్‌లో పిలుపునిచ్చారు.

ఆయుర్వేద వైద్యానికి ప్రభుత్వ నిర్లక్ష్యం..

డిస్పెన్సరీల్లో మందుల కరువు.. రోగులకు మొండి చేయి..

వైద్యులు ఉన్నారు, సిబ్బంది ఉన్నారు,లక్షల్లో జీతాలు ఉన్నాయి,కానీ మందులే లేవు..

మూడు నెలలకు కిలో అశ్వగంధనా.? మిగతా చూర్ణాలు అసలే లేవు, వేలాది మంది రోగులకు ఇదేనా వైద్య సేవలు.?

అశ్వగంధ, శతావరి నుంచి త్రిఫల చూర్ణం వరకు.. నిత్యం అవసరమైన మందులన్నీ కొరతే..

ఆయుర్వేద విభాగంను పట్టించుకోని

ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ..





హైదరాబాద్, (ప్రజావినికిడి):
ఆయుర్వేదానికి పుట్టినిల్లుగా పేరొందిన భారతదేశంలోనే ఆయుర్వేద వైద్యానికి ప్రభుత్వ ప్రోత్సాహం కరువవడం విడ్డూరంగా మారింది. ప్రజలకు సంప్రదాయ వైద్యాన్ని అందించాల్సిన తెలంగాణ రాష్ట్రంలోని ఆయుర్వేద డిస్పెన్సరీలు మందుల కొరతతో వెలవెలబోతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.వైద్యులు, సిబ్బందిని నియమించి లక్షలాది రూపాయలు వేతనాల రూపంలో ఖర్చు చేస్తున్న ప్రభుత్వం, రోగులకు అవసరమైన మందులను మాత్రం ఎందుకు సరఫరా చేయడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.అశ్వగంధ, శతావరి, జటామాంసి, పునర్నవ, పల్లేరు,త్రిఫల చూర్ణం, సునాముఖి, తిప్పతీగ చూర్ణం, వేప చూర్ణం, అతిబల చూర్ణం, అతిమధురం, జీర్ణకోశ సమస్యలకు వినియోగించే హింగ్వాష్టక చూర్ణం వంటి సాధారణ ఆయుర్వేద ఔషధాలు సైతం అనేక డిస్పెన్సరీల్లో అందుబాటులో లేవని రోగులు వాపోతున్నారు. సాధారణ సమస్యలతో వచ్చే పేదలు, వృద్ధులు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలకు వెళ్లినా అవసరమైన మందులు లభించక నిరాశతో వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూడు నెలలకు కిలో అశ్వగంధ.. ఎలా సరిపోతుంది.?

ఒక్కో ఆయుర్వేద డిస్పెన్సరీకి రోజుకు సుమారు 30 నుంచి 50 మంది వరకు రోగులు వస్తుంటారని చెబుతున్నారు. అలాంటప్పుడు మూడు నెలలకు ఒకసారి కేవలం ఒక కిలో అశ్వగంధ,ఇతర మందుల పొడిని కేటాయించడం ఎంతవరకు సమంజసమని ప్రజలు నిలదీస్తున్నారు. ఇంత తక్కువ పరిమాణంలో మందులు సరఫరా చేస్తే రోగులందరికీ ఎలా అందించగలరని ప్రశ్నిస్తున్నారు. మందుల కేటాయింపులు రోగుల సంఖ్యకు అనుగుణంగా ఉన్నాయా.? అవసరాలకు తగ్గట్టుగా ఔషధాల కొనుగోళ్లు జరుగుతున్నాయా.? లేక మందుల సరఫరా లో గోల్మాల్ జరుగుతోందా.? అన్న అంశాలపై ఉన్నతాధికారులు సమీక్షించాల్సిన అవసరం ఉంది.

చిన్నారుల మందులకూ కొరతే

చిన్నపిల్లలకు ఉపయోగించే అశ్వగంధ లేహ్యం,సరస్వతి లేహ్యంతో పాటు రోగనిరోధక శక్తికి తోడ్పడే చ్యవన్‌ప్రాశ్ వంటి ఔషధాలు,వివిధ రకాల ఆయుర్వేద గుళికలు కూడా అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. సంప్రదాయ వైద్యంపై నమ్మకంతో ప్రభుత్వ డిస్పెన్సరీలను ఆశ్రయించే పేద కుటుంబాలకు మందులు అందకపోవడం ప్రభుత్వ వైద్య సేవల లక్ష్యానికే విరుద్ధమని విమర్శలు వినిపిస్తున్నాయి.

జీతాలకు నిధులు ఉన్నాయి.. మందులకు నిధులు లేవా.?

డిస్పెన్సరీల్లో వైద్యులు, ఫార్మసిస్టులు, ఇతర సిబ్బందిని నియమించి జీతాలు చెల్లిస్తున్నప్పుడు రోగులకు అవసరమైన మందులు సరఫరా చేయడంలో తెలంగాణ ప్రభుత్వ నిర్లక్ష్యం ఎందుకని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. డిస్పెన్సరీల సంఖ్య పెంచడం మాత్రమే కాకుండా, వాటికి సరిపడా ఔషధాలను అందుబాటులో ఉంచినప్పుడే ప్రజలకు నిజమైన వైద్య సేవలు అందుతాయని అభిప్రాయపడుతున్నారు.

కమిషనర్, ఆరోగ్యశాఖ మంత్రి స్పందించాలి

ఇప్పటికైనా ఆయుష్ విభాగం కమిషనర్, తెలంగాణ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తక్షణమే స్పందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రతి ఆయుర్వేద డిస్పెన్సరీకి రోగుల సంఖ్య ఆధారంగా నెలవారీ మందుల కేటాయింపులు పెంచాలని, అవసరమైన చూర్ణాలు, లేహ్యాలు, గుళికలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు. అసలు ఇప్పటివరకు ఆరోగ్య శాఖ మంత్రి ఆయుర్వేద మందులపై సమీక్ష నిర్వహించారా.? నిర్వహిస్తే ఇంత దారుణమైన పరిస్థితులు డిస్పెన్సరీలో ఉంటే ఎందుకు వాటిని చక్కదిద్దలేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మందుల కొరతపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి సరఫరా వ్యవస్థను ప్రక్షాళన చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.లేక మందులను ప్రభుత్వం సరఫరా చేస్తున్న మధ్యలో స్వాహా అవుతున్నాయా.? లేక మందులు కేవలం పేపర్లకే పరిమితమై వాస్తవానికి సరఫరా జరగకుండా ప్రైవేటు ఆయుర్వేద మెడికల్ షాపులకు సరఫరా అవుతున్నాయా.? అన్న దానిపై కూడా పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలి. ఆయుర్వేద వైద్యాన్ని మాటల్లో కాకుండా చేతల్లో ప్రోత్సహించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పౌల్ట్రీ దిగ్గజం స్నేహ ఫామ్స్‌పై ఐటీ రైడ్స్..

తెలుగు రాష్ట్రాల్లో 16 చోట్ల ఏకకాలంలో మెరుపు దాడులు

నవంబర్ 21: (ప్రజావినికిడి):
ప్రముఖ పౌల్ట్రీ, అగ్రి బిజినెస్ సంస్థ స్నేహ గ్రూప్‌పై ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ అధికారులు శనివారం ఉదయం మెరుపు దాడులు చేపట్టారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా మొత్తం 16 ప్రాంతాల్లో ఏకకాలంలో ఈ సోదాలు కొనసాగుతున్నాయి. హైదరాబాద్, విజయవాడ నగరాల్లోని ప్రధాన కార్యాలయాలతో పాటు డైరెక్టర్ల నివాసాల్లోనూ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. కొండాపూర్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ సంస్థ కీలక రికార్డులను అధికారులు పరిశీలిస్తున్నారు. సంస్థ డైరెక్టర్లు రామ్‌రెడ్డి డెండి, వరుణ్ రెడ్డి డెండి, స్నేహ డెండిల ఇళ్లలోనూ ఐటీ బృందాలు ఏకకాలంలో



తనిఖీలు చేపట్టాయి. 1982లో రామ్‌రెడ్డి చికెన్ మార్కెట్‌గా ప్రారంభమైన ఈ వ్యాపారం, 1994 నాటికి స్నేహ ఫామ్స్‌గా విస్తరించింది. ప్రస్తుతం పౌల్ట్రీ బ్రీడింగ్, చికెన్ ప్రాసెసింగ్, పశువుల దాణా రంగాలతో పాటు 'సఫల' బ్రాండ్‌తో వంట నూనెల తయారీ విభాగంలోనూ ఈ సంస్థ వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తోంది.
తెలంగాణలో గంటకు దాదాపు 12,000 కోళ్లను ప్రాసెస్ చేసే భారీ సామర్థ్యం కలిగిన అధునాతన ఆటోమేటెడ్ ప్లాంట్‌ను స్నేహ గ్రూప్ నడుపుతోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో రెండు వేల మందికి పైగా కాంట్రాక్ట్ రైతులతో కలిసి ఈ సంస్థ అనుసంధానమై పనిచేస్తోంది. పన్ను చెల్లింపుల్లో ఏవైనా అవకతవకలు జరిగాయా అన్న కోణంలో అధికారులు రికార్డులు, హార్డ్‌డిస్క్‌లు, బ్యాంకు ఖాతాల వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం.

కోట నీలిమపై వ్యాఖ్యల వివాదం..

ఒవైసీపై మహిళా కమిషన్‌కు కాంగ్రెస్ ఫిర్యాదు

నవంబర్ 21: (ప్రజావినికిడి):
టీపీసీసీ ఉపాధ్యక్షురాలు కోట నీలిమను ఉద్దేశించి ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు సనత్‌నగర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేతలు శనివారం తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారదను కలిసి ఒవైసీపై అధికారికంగా ఫిర్యాదు చేశారు. మహిళా నేతపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం రాజకీయ సంస్కృతికి విరుద్ధమని, ఈ వ్యవహారంపై ఒవైసీకి నోటీసులు జారీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



కాంగ్రెస్ నేతలు తమ ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. కోట నీలిమ సనత్‌నగర్ నియోజకవర్గంలో మహిళలు, మైనారిటీలు, బలహీన వర్గాల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న బలమైన నేత అని తెలిపారు. రాజకీయ విభేదాల కోసం మహిళా ప్రజాప్రతినిధులను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకోవడం వారి గౌరవానికి భంగం కలిగించడమేనని పేర్కొన్నారు. ఒవైసీ వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, నీలిమకు బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ప్రజా జీవితంలో ఉన్న మహిళల గౌరవాన్ని కాపాడేలా మహిళా కమిషన్ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.ఈ వివాదం కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ పవన్ ఖేరా చేసిన వ్యాఖ్యలతో మొదలైంది. రాబోయే ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో చంద్రశేఖర్ ఆజాద్‌కు చెందిన ఆజాద్ సమాజ్ పార్టీతో ఎంఐఎం పొత్తు పెట్టుకోవడాన్ని ప్రస్తావిస్తూ పవన్ ఖేరా హిందీ సినిమా 'మైన్ తులసి తేరే ఆంగన్ కీ'ని ఉటంకించారు. యూపీలో ప్రస్తుతం 'మైన్ ఒవైసీ తేరే ఆంగన్ కా' అనే కొత్త సినిమా నడుస్తోందని ఎద్దేవా చేశారు.ఖేరా వ్యాఖ్యలపై అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా స్పందించారు. పవన్ ఖేరా ముందుగా తన భార్య (కోట నీలిమ) గురించి ఆలోచించాలని వ్యాఖ్యానించారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆమె డిపాజిట్ కోల్పోయారని ఒవైసీ పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతలు తమ సొంత పార్టీలోని పరిణామాలపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.
ఈ వ్యాఖ్యలను కాంగ్రెస్ శ్రేణులు తీవ్రంగా ఖండించాయి. హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ ఖలీద్ సైఫుల్లా ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ప్రదర్శన చేపట్టి ఒవైసీ దిష్టిబొమ్మను దహనం చేశారు. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కోట నీలిమ డిపాజిట్ కోల్పోయారంటూ ఒవైసీ చేసిన వ్యాఖ్యలు అవాస్తవమని, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని సైఫుల్లా స్పష్టం చేశారు. మహిళా నాయకులపై ఇటువంటి అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం తగదని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

తొలి టెస్టుకు సిరాజ్‌ను పక్కన పెట్టడంపై తెలంగాణ మంత్రి అజహరుద్దీన్ అసంతృప్తి

నవంబర్ 21(ప్రజావినికిడి):

న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌లో హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్‌ను భారత తుది జట్టు నుంచి తప్పించడంపై భారత మాజీ కెప్టెన్, తెలంగాణ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దేశానికి ఎన్నో విజయాలు అందించిన సిరాజ్ పట్ల జట్టు యాజమాన్యం మరింత మెరుగైన ప్రాధాన్యం ఇచ్చి ఉండాల్సిందని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ విషయమై అజహరుద్దీన్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. గతంలో ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా జట్టుకు దూరం అయిన కీలక సందర్భాల్లో సిరాజ్ ముందుండి పేస్ విభాగాన్ని నడిపించిన తీరును, అతడి అంకితభావం, ప్రతిభ, మైదానంలో చూపించే పోరాట పటిమను ఆయన గుర్తుచేశారు. ఇదే సమయంలో జట్టులోకి ఎంపికైన యువ పేసర్ అన్షుల్ కాంబోజ్‌కు శుభాకాంక్షలు



తెలిపిన అజహరుద్దీన్, సిరాజ్‌ను తుది జట్టు నుంచి ఎందుకు తప్పించాల్సి వచ్చిందో టీమ్ మేనేజ్‌మెంట్ అతడికి పూర్తి స్పష్టతతో, తగిన గౌరవంతో వివరించి ఉంటుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

భారత జట్టుకు సుదీర్ఘ కాలం కెప్టెన్‌గా సేవలు అందించిన అనుభవంతో పాటు తెలంగాణ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న అజహరుద్దీన్ చేసిన ఈ వ్యాఖ్యలు క్రీడా, రాజకీయ వర్గాల్లో తీవ్ర ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. మరోవైపు, సిరాజ్ ఎంపిక వ్యవహారం రాజకీయ, మతపరమైన మలుపు తీసుకుంది. ఆటగాళ్ల ఎంపిక ప్రక్రియలో మతపరమైన అంశాలు ప్రభావం చూపాయా అని కాంగ్రెస్ ఎంపీ ఒకరు ఆరోపించారు. సిరాజ్ ముస్లిం అయినందువల్లే అతడిని పక్కన పెట్టారా అంటూ ఆయన ప్రశ్నించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.ప్రస్తుతం జరుగుతున్న తొలి టెస్టులో మూడో రోజు ఆట ముగిసే సమయానికి భారత జట్టు పటిష్ఠ స్థితిలో కొనసాగుతున్నప్పటికీ, సిరాజ్‌ను తుది జట్టు నుంచి తప్పించడంపై మొదలైన చర్చ మాత్రం కొనసాగుతూనే ఉంది.

సిరాజ్ కు తుదిజట్టులో చోటు లభించకపోవడంపై టీమిండియా బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ ఇప్పటికే వివరణ ఇచ్చాడు. ఇద్దరు సీమ్ బౌలర్లు, ఇద్దరు స్పిన్ బౌలర్ల కూర్పుతో బరిలో దిగుతున్నామని, అందుకే సిరాజ్ కు తుది జట్టులో స్థానం లభించలేదని తెలిపాడు.

ఉమామహేశ్వరుల అంతరార్థం అదే..

రాహుల్, ప్రియాంక గాంధీలకు స్వామి పరమాత్మానంద బహిరంగ లేఖ

నవంబర్ 21: (ప్రజావినికిడి):

శివపార్వతుల చిత్రానికి గల లోతైన తాత్విక అంతరార్థాన్ని అర్థం చేసుకోవాలని సూచిస్తూ హిందూ ధర్మ ఆచార్య సభ ప్రధాన కార్యదర్శి స్వామి పరమాత్మానంద సరస్వతి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు బహిరంగ లేఖ రాశారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇటీవల సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన శివపార్వతుల చిత్రానికి సంబంధించి ఆయన ఈ వివరణ ఇచ్చారు. పరమశివుడి ఒడిలో పార్వతీదేవి కూర్చున్న సంప్రదాయ చిత్రణ కేవలం ఒక సాధారణ దృశ్యం కాదని, దాని వెనుక ఉపనిషత్తులు, శాస్త్రాలు బోధించిన పరమోన్నత జ్ఞానం దాగి ఉందని పేర్కొన్నారు.తాను చూసిన ఆ చిత్రం ద్వారా రాహుల్ ఏం చెప్పాలనుకున్నారో తనకు తెలియదని, అయితే సనాతన ధర్మంలోని అంతరార్థాన్ని తెలియజేయడానికే



ఈ లేఖ రాస్తున్నానని స్వామి పరమాత్మానంద చెప్పారు. నిరాకారమైన, నిర్గుణమైన బ్రహ్మమే సృష్టి, స్థితి, లయకారకమైన శక్తులను మేల్కొలిపినప్పుడు ఈశ్వరుడిగా (శివుడిగా) మారుతుందని వివరించారు. శివుడు శక్తిమంతుడైతే, పార్వతీదేవి సృష్టికి మూలమైన 'శక్తి' లేదా 'మాయ' అని తెలిపారు. శక్తిమంతుడైన శివుడిని విడిచి శక్తికి స్వతంత్ర అస్తిత్వం ఉండదని, ఉమామహేశ్వరుల రూపం లేదా అర్ధనారీశ్వర రూపం ఈ తత్వాన్నే లోకానికి తెలియజేస్తాయని స్పష్టం చేశారు. సనాతన ధర్మంలోని పవిత్ర చిత్రాలను బాహ్య దృష్టితో కాకుండా, అవి బోధించే అంతర్గత సత్యాన్ని గురు-శిష్య పరంపర ద్వారానే గ్రహించగలమని ఆయన హితవు పలికారు.

ఇటీవల సోనియా గాంధీ, దివంగత ప్రధాని రాజీవ్ గాంధీల దాంపత్యంపై జరిగిన రాజకీయ చర్చల నేపథ్యంలో రాహుల్ గాంధీ ఈ చిత్రాన్ని పోస్ట్ చేశారు. భయం, కోపం, ద్వేషం ఉన్నవారు ప్రేమను అనుభవించలేరంటూ బీజేపీ, ఆరెస్సెస్‌లను విమర్శిస్తూ ఆయన 'ఎక్స్' వేదికగా ఆ ఫోటోను పంచుకున్నారు. ఈ వివాదాల నేపథ్యంలో స్వామి పరమాత్మానంద రాసిన ఈ తాత్విక లేఖ ప్రస్తుతం ప్రాధాన్యత సంతరించుకుంది.

జీటీఏ-6 రికార్డు..

తొలిరోజే రూ.31,000 కోట్ల అమ్మకాలతో అతిపెద్ద ఎంటర్‌టైన్‌మెంట్ లాంచ్

24 గంటల్లోనే రూ.31,000 కోట్లకు పైగా వసూలు చేసిన జీటీఏ 6

మొదటి రోజే 3.25 కోట్ల యూనిట్లు అమ్ముడైనట్లు రాక్‌స్టార్ గేమ్స్ ప్రకటన

గతంలో జీటీఏ 5 నెలకొల్పిన 800 మిలియన్ డాలర్ల రికార్డు బద్దలు

అవెంజర్స్ ఎండ్‌గేమ్ లైఫ్‌టైమ్ బాక్సాఫీస్ కలెక్షన్లను అధిగమించిన వైనం

దాదాపు 1 బిలియన్ డాలర్ల భారీ నిర్మాణ వ్యయంతో విడుదలైన ప్రాజెక్ట్

నవంబర్ 21: (ప్రజావినికిడి):

ప్రపంచ వీడియో గేమింగ్ చరిత్రలో కనీవినీ ఎరుగని సరికొత్త రికార్డు నమోదైంది. అత్యంత భారీ అంచనాల నడుమ విడుదలైన యాక్షన్-అడ్వెంచర్ గేమ్ 'గ్రాండ్ తెఫ్ట్ ఆటో 6' (జీటీఏ 6) ప్రపంచ వినోద రంగాన్ని షేక్ చేసింది. విడుదలైన కేవలం 24



గంటల వ్యవధిలోనే ఏకంగా 3.79 బిలియన్ డాలర్ల (సుమారు రూ.31,000 కోట్లపైనే) అంతర్జాతీయ అమ్మకాలను సాధించింది. గతంలో తన మునుపటి వెర్షన్ 'జీటీఏ 5' పేరిట ఉన్న రికార్డును ఇది బద్దలు కొట్టింది. వినోద రంగ చరిత్రలోనే అతిపెద్ద విడుదలలో ఒకటిగా సరికొత్త మైలురాయిని లిఖించింది.

ప్రీ-రిలీజ్ బుకింగ్స్, మొదటి రోజు కొనుగోళ్ల ద్వారా ప్రపంచవ్యాప్తంగా దాదాపు 3.25 కోట్ల కాపీలు అమ్ముడైనట్లు గేమ్ డెవలపర్ రాక్‌స్టార్ గేమ్స్ అధికారికంగా వెల్లడించింది. 2013లో విడుదలైన 'జీటీఏ 5' మొదటి రోజు సాధించిన 800 మిలియన్ డాలర్ల ఆదాయంతో పోలిస్తే ఇది దాదాపు ఐదు రెట్లు ఎక్కువ కావడం విశేషం. అంతేకాకుండా హాలీవుడ్ చలనచిత్ర చరిత్రలో సంచలనం సృష్టించిన 'అవెంజర్స్: ఎండ్‌గేమ్' జీవితకాల ప్రపంచ బాక్సాఫీస్ వసూళ్లను (2.94 బిలియన్ డాలర్లు) కేవలం ఒక్క రోజులోనే ఈ గేమ్ దాటేసి సరికొత్త సంచలనం సృష్టించింది.

కల్పిత వైస్ సిటీ నేపథ్యంలో లూసియా, జాసన్ బ్లిట్జ్ అనే నేర పాత్రల చుట్టూ ఈ గేమ్ కథనం సాగుతుంది. రాక్‌స్టార్ గేమ్స్ మాతృ సంస్థ టేక్-టూ ఇంటరాక్టివ్ ఈ గేమ్‌ను దాదాపు 1 బిలియన్ డాలర్ల భారీ బడ్జెట్‌తో నిర్మించింది. దీన్ని ఆడేందుకు ప్రపంచవ్యాప్తంగా గేమర్లు తమ ఉద్యోగాలకు ప్రత్యేక సెలవులు పెట్టడంతో పాటు, తమకు అంతరాయం కలిగించకుండా కుటుంబ సభ్యులతో ముందస్తు ఒప్పందాలు చేసుకుంటున్నారంటే క్రేజ్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. పీసీ వెర్షన్‌తో పాటు ఆన్‌లైన్ మల్టీప్లేయర్ సదుపాయాలు 2027 నాటికి అందుబాటులోకి రావచ్చని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

ఇంట్లో ఎంత బంగారం ఉంచుకోవచ్చు? ఐటీఏటీ తీర్పుతో మళ్లీ చర్చ

నవంబర్ 21(ప్రజావినికిడి):

భారతీయ కుటుంబాల్లో బంగారానికి ప్రత్యేకమైన స్థానం ఉంటుంది. పెళ్లిళ్లు, పండుగలు, శుభకార్యాల్లో మహిళలు బంగారాన్ని ఎంతో ఇష్టంగా కొనుగోలు చేస్తుంటారు. పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చే ఆభరణాలు కూడా చాలా ఇళ్లలో ఉంటాయి. అయితే ఇంట్లో ఎంత బంగారం ఉంచుకోవచ్చనే విషయంలో చాలామందికి సందేహాలు వస్తుంటాయి. ఆదాయపు పన్ను శాఖ సోదాలు జరిగితే ఇంట్లో ఉన్న బంగారాన్ని అధికారులు జప్తు చేస్తారా అన్న భయం కొందరిలో ఉంటుంది. ఇటీవల హైదరాబాద్ ఆదాయపు పన్ను అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఐటీఏటీ) ఇచ్చిన తీర్పుతో ఈ అంశంపై పూర్తి స్పష్టత వచ్చింది.

హైదరాబాద్ ఐటీఏటీ కీలక తీర్పు

ఇటీవల ఓ పన్ను చెల్లింపుదారుడి నివాసంలో ఆదాయపు పన్ను శాఖ సోదాలు నిర్వహించింది. ఆ సమయంలో 807.5 గ్రాముల నికర బరువున్న



బంగారు ఆభరణాలు లభించాయి. వాటి విలువ సుమారు రూ.16.01 లక్షలుగా నిర్ధారించారు. సరైన ఆధారాలు చూపలేదంటూ అధికారులు దానిని లెక్కల్లో చూపని పెట్టుబడిగా భావించారు. దీనిపై పన్ను చెల్లింపుదారుడు అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. ఆ బంగారం భార్య, కుమార్తె, కుమారుడు, తనదని వివరించారు. కుటుంబ సభ్యుల పరిమితికి లోబడే ఆ బంగారం ఉందని ట్రిబ్యునల్ అంగీకరించింది. దీంతో రూ.16 లక్షల అదనపు పన్ను పెంపును పూర్తిగా కొట్టివేసింది.

సీబీడీటీ మార్గదర్శకాల పరిమితులు ఇవే

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్ (సీబీడీటీ) నిబంధనల ప్రకారం సోదాల సమయంలో నిర్దిష్ట పరిమితుల్లోపు ఉన్న బంగారాన్ని అధికారులు జప్తు చేయకూడదు:

వివాహిత స్త్రీ: 500 గ్రాముల వరకు బంగారు ఆభరణాలు.

అవివాహిత స్త్రీ: 250 గ్రాముల వరకు ఆభరణాలు.

పురుషుడు: 100 గ్రాముల వరకు బంగారు ఆభరణాలు.

ఈ పరిమితులకు లోబడి ఇంట్లో బంగారం ఉంటే అధికారులు దానిని స్వాధీనం చేసుకోరు. అంతేకాకుండా కుటుంబ సాంప్రదాయాలు, హోదాను బట్టి అంతకంటే ఎక్కువ ఉన్నా కూడా పరిశీలించి మినహాయింపు ఇచ్చే అధికారం అధికారులకు ఉంటుంది.

ఇంట్లో బంగారం పరిమితిపై ఉన్న అపోహలు

సీబీడీటీ నిర్దేశించిన ఈ పరిమాణాలు బంగారం కలిగి ఉండటానికి గరిష్ఠ పరిమితులు కావు. ఆదాయ మార్గాలు స్పష్టంగా ఉంటే ఎంత బంగారమైనా ఇంట్లో నిరభ్యంతరంగా ఉంచుకోవచ్చు. సరైన లెక్కలు, ఇన్వాయిస్‌లు ఉంటే పరిమితికి మించి బంగారం ఉన్నా ఎలాంటి ఇబ్బంది ఉండదు. కేవలం సోదాలు జరిగినప్పుడు వెంటనే జప్తు చేయకుండా ఉండటానికి మాత్రమే బోర్డు ఈ పరిమితులను మార్గదర్శకంగా ఇచ్చింది. వారసత్వంగా వచ్చిన బంగారమైనా సరే మూలాలు నిరూపించగలిగితే ప్రభుత్వం ఎలాంటి ఆంక్షలు విధించదు.

నగదు నిల్వలపైనా ట్రైబ్యునల్ స్పష్టత

ఇదే కేసులో పన్ను చెల్లింపుదారుడి ఇంట్లో దొరికిన రూ.3.88 లక్షల నగదుపైనా అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే తమ వ్యాపార బ్యాలెన్స్ షీట్ లెక్కల్లో అంతకంటే ఎక్కువ నగదు చేతిలో ఉన్నట్లు చూపించారని ట్రైబ్యునల్ గుర్తించింది. పుస్తకాల్లో నమోదైన లెక్కల ప్రకారం నగదు నిల్వలు సరిపోవడంతో ఆ పన్ను భారాన్ని కూడా రద్దు చేసింది. సరైన రికార్డులు నిర్వహిస్తే ఎలాంటి తనిఖీల సమయంలోనైనా చట్టబద్ధమైన రక్షణ లభిస్తుందని ఈ తీర్పు స్పష్టం చేస్తోంది.

మూడు రోజులు బ్యాంకులు బంద్..

సెలవు రోజుల్లో ఆన్‌లైన్, ఏటీఎం సేవలు యథాతథం

నవంబర్ 21:(ప్రజావినికిడి):



బ్యాంకు ఖాతాదారులకు ముఖ్య గమనిక. వచ్చే వారం (నవంబర్ 22 నుంచి 28 వరకు) బ్యాంకులకు పలు సెలవులు ఉన్నాయి. ముఖ్యమైన పనుల కోసం బ్యాంకులకు వెళ్లాలనుకునే వారు ఈ సెలవుల జాబితాను ముందుగా చూసుకోవడం మంచిది. లేదంటే అనవసరంగా ఇబ్బంది పడాల్సి వస్తుంది. గురునానక్ జయంతి, నాలుగో శనివారం వంటి కారణాలతో దేశంలోని అనేక ప్రాంతాల్లో బ్యాంకులు మూతపడనున్నాయి.

సెలవుల వివరాలు:

నవంబర్ 23 (సోమవారం):

సెంగ్ కుట్ స్నెమ్ సందర్భంగా కేవలం షిల్లాంగ్‌లో మాత్రమే బ్యాంకులకు సెలవు ప్రకటించారు.

నవంబర్ 24 (మంగళవారం):

గురునానక్ జయంతి, కార్తీక పౌర్ణమి సందర్భంగా హైదరాబాద్, న్యూఢిల్లీ, ముంబై, కోల్‌కతా, భోపాల్, చండీగఢ్, జైపూర్, కాన్పూర్, లక్నో సహా పలు ప్రధాన నగరాల్లో బ్యాంకులు పనిచేయవు.

నవంబర్ 27 (శుక్రవారం):

కనకదాస జయంతి సందర్భంగా బెంగళూరులో బ్యాంకులకు సెలవు.

ఇక నవంబర్ 28వ తేదీ నెలలో నాలుగో శనివారం కావడంతో దేశవ్యాప్తంగా అన్ని బ్యాంకులకు సెలవు ఉంటుంది.బ్యాంకు శాఖలు మూసి ఉన్నప్పటికీ, ఖాతాదారులు ఆన్‌లైన్ సేవలను యథావిధిగా వినియోగించుకోవచ్చు. యూపీఐ, నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, ఏటీఎం సేవలు 24 గంటలూ అందుబాటులో ఉంటాయి. ప్రాంతీయ పండుగలను బట్టి ఆర్‌బీఐ క్యాలెండర్ ప్రకారం రాష్ట్రాలవారీగా సెలవులు మారుతుంటాయి. కాబట్టి, బ్యాంకులకు వెళ్లే ముందు సెలవుల వివరాలు తెలుసుకోవడం ఉత్తమం.

167 ఏళ్లుగా నిపుణులను ఇబ్బంది పెట్టిన గణిత పజిల్.. క్లాడ్ ఏఐ ఛేదించిందా?

167 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న రీమాన్ హైపోథీసిస్‌కు పరిష్కారం కనుగొన్నట్లు ప్రకటన

'క్లాడ్' ఏఐతో కలిసి దీనిని సాధించిన గణిత శాస్త్రవేత్త లెవెంట్ ఆల్ఫ్‌గే

ఇది క్లే మ్యాథమెటిక్స్ ఇన్‌స్టిట్యూట్ ప్రకటించిన మిలియన్ డాలర్ల బహుమతి ఉన్న సమస్య

లీన్ ప్రోగ్రామింగ్ భాషలో రాసిన ప్రూఫ్‌ను పరిశీలిస్తున్న నిపుణులు

శాస్త్రీయ ఆవిష్కరణలపై ఏఐ ప్రభావంపై మొదలైన విస్తృత చర్చ

నవంబర్ 21:(ప్రజావినికిడి):

గణిత ప్రపంచంలో 167 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఓ మహా రహస్యం వీడినట్టే కనిపిస్తోంది. ప్రపంచంలోని మేధావులనే దశాబ్దాలుగా తలలు పట్టుకునేలా చేసిన 'రీమాన్ హైపోథీసిస్'కు తాను పరిష్కారం కనుగొన్నానని ఓ గణిత శాస్త్రవేత్త సంచలన ప్రకటన చేశారు. ఆంథ్రోపిక్ సంస్థలో పనిచేస్తున్న లెవెంట్ ఆల్ఫ్‌గే ఈ ఘనతను సాధించగా, దీనికి 'క్లాడ్' ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మోడల్ సహాయం తీసుకున్నట్లు వెల్లడించారు.

"క్లాడ్ ఏఐతో కలిసి నేను రీమాన్ హైపోథీసిస్‌కు రుజువును కనుగొన్నానని నమ్ముతున్నాను" అని ఆల్ఫ్‌గే తన వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. మొదట్లో తాను ఏఐకి మార్గనిర్దేశం చేసినా, చివరి దశలో క్లాడ్ తనను మించిపోయి అద్భుతాలు చేసిందని ఆయన వివరించారు. ఈ ఆవిష్కరణతో ఏఐ సామర్థ్యం మరోసారి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది.


సాధారణ లెక్కల నుంచి సంక్లిష్ట సమస్యల వరకు ఏఐ ప్రస్థానం


ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ గణిత శాస్త్రంలో వేగంగా పురోగమిస్తోంది. 2023లో సాధారణ నాలుగు అంకెల కూడికలకే ఇబ్బంది పడిన ఏఐ మోడళ్లు, 2025 నాటికి అంతర్జాతీయ మ్యాథమెటికల్ ఒలింపియాడ్‌లో స్వర్ణ పతకాలు సాధించే స్థాయికి ఎదిగాయి. ఈ ఏడాది ఆరంభంలో అపరిష్కృత సమస్యలను పరిష్కరించడం మొదలుపెట్టాయి. గత నెలలోనే ఓపెన్‌ఏఐకి చెందిన మోడల్ 'నావియర్-స్టోక్స్' అనే మరో మిలీనియం ప్రైజ్ సమస్యపై పురోగతి సాధించింది. ఇప్పుడు క్లాడ్ ఏఐ ఏకంగా రీమాన్ హైపోథీసిస్‌ను ఛేదించడంపై ప్రకటన రావడం సంచలనంగా మారింది.

ఏమిటీ రీమాన్ హైపోథీసిస్?

జర్మన్ గణిత శాస్త్రవేత్త బెర్న్‌హార్డ్ రీమాన్ 1859లో దీనిని ప్రతిపాదించారు. ప్రధాన సంఖ్యల (ప్రాథిఅఎవ చీబఎఎవతీం) అమరిక వెనుక ఉన్న రహస్యాన్ని ఈ సిద్ధాంతం వివరిస్తుంది. ప్రధాన సంఖ్యల పంపిణీకి, రీమాన్ జీటా ఫంక్షన్‌కు మధ్య ఉన్న సంబంధాన్ని ఇది స్పష్టం చేస్తుంది. దీనిని నిరూపిస్తే గణితంలోని అనేక విభాగాలను అనుసంధానించవచ్చు.

దీని ప్రాముఖ్యతను గుర్తించిన క్లే మ్యాథమెటిక్స్ ఇన్‌స్టిట్యూట్, దీనిని పరిష్కరించిన వారికి మిలియన్ డాలర్ల (సుమారు రూ. 9.2కోట్లు) బహుమతిని ప్రకటించింది. ఇప్పటివరకు ఆ సంస్థ ప్రకటించిన ఏడు





మిలీనియం ప్రైజ్ సమస్యల్లో 'పాయిన్‌కేర్ కన్జెక్చర్' మాత్రమే అధికారికంగా పరిష్కారమైంది.

ప్రూఫ్ ఎంతవరకు నమ్మశక్యం?

ఆల్ఫ్‌గే తన ప్రూఫ్‌ను 'లీన్' (ూుఅ) అనే ప్రత్యేక కంప్యూటర్ ప్రోగ్రామింగ్ భాషలో రాశారు. గణిత వాదనలను దశలవారీగా తనిఖీ చేయడానికి దీనిని ఉపయోగిస్తారు. ఎంఐటీ గణిత శాస్త్రవేత్త ఆండ్రూ సదర్‌లాండ్ వంటి స్వతంత్ర పరిశోధకులు ఈ ప్రూఫ్‌ను తమ సిస్టమ్‌లలో కంపైల్ చేసి చూడగా ఎలాంటి సమస్యలు ఎదురుకాలేదు. అయితే, క్లే మ్యాథమెటిక్స్ ఇన్‌స్టిట్యూట్ ఇంకా దీనిని అధికారికంగా అంగీకరించలేదు.ఈ ప్రకటనపై ఇప్పటికే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భవిష్యత్తులో శాస్త్రీయ ఆవిష్కరణలు కాలిక్యులేటర్‌పై బటన్ నొక్కినంత సులభం కావచ్చని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. మరికొందరు, గణిత విద్య తన ప్రాధాన్యతను కోల్పోయి, కేవలం మెదడుకు వ్యాయామంలా మిగిలిపోవచ్చనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతానికి ఈ చారిత్రాత్మక ప్రకటనపై అధికారిక ధ్రువీకరణ కోసం గణిత ప్రపంచం ఉత్కంఠగా ఎదురుచూస్తోంది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

వ్యాఖ్యాన ప్యానెల్ నుంచి వార్నర్, ఖవాజా తొలగింపు

శాండ్‌పేపర్ వివాదం మళ్లీ ముదరడంతో ఫాక్స్ స్పోర్ట్స్ నిర్ణయం.. కొన్ని వారాల పాటు ప్రసారాలకు దూరం



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా క్రికెట్‌లో ఎనిమిదేళ్ల క్రితం సంచలనం సృష్టించిన బాల్ టాంపరింగ్ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ వివాదం కారణంగా మాజీ క్రికెటర్లు డేవిడ్ వార్నర్, ఉస్మాన్ ఖవాజాలకు ఎదురుదెబ్బ తగిలింది. వీరిద్దరినీ ఫాక్స్ స్పోర్ట్స్ తన క్రికెట్ వ్యాఖ్యాన ప్యానెల్ నుంచి తాత్కాలికంగా తప్పించింది. ఇంగ్లండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో వీరు వ్యాఖ్యాతలుగా వ్యవహరించడం లేదు. గతంలో చోటుచేసుకున్న బాల్ టాంపరింగ్ ఘటనపై ఖవాజా తన ఆత్మకథలో చేసిన వ్యాఖ్యలు, వాటికి వార్నర్ మద్దతు తెలపడం తాజా పరిణామాలకు కారణమయ్యాయి. 2018లో దక్షిణాఫ్రికా పర్యటన సందర్భంగా కేప్‌టౌన్ టెస్టులో ఆస్ట్రేలియా ఆటగాళ్లు బంతి ఆకారాన్ని మార్చేందుకు శాండ్‌పేపర్ ఉపయోగించిన ఘటన అప్పట్లో ప్రపంచ క్రికెట్‌ను కుదిపేసింది. ఈ వ్యవహారంలో అప్పటి కెప్టెన్ స్టీవ్ స్మిత్, వైస్ కెప్టెన్ డేవిడ్ వార్నర్, కామెరాన్ బాన్‌క్రాఫ్ట్‌పై చర్యలు తీసుకున్నారు. స్మిత్, వార్నర్‌లపై ఏడాది నిషేధం విధించగా, బాన్‌క్రాఫ్ట్‌పై తొమ్మిది నెలల నిషేధం విధించారు. ఈ ఘటనతో ఆస్ట్రేలియా క్రికెట్ ప్రతిష్ఠ తీవ్రంగా దెబ్బతింది. అనంతరం జట్టు నాయకత్వంలోనూ, నిర్వహణలోనూ పలు మార్పులు చోటుచేసుకున్నాయి. అయితే ఈ ఘటనకు సంబంధించిన అసలు విషయాలు మరోసారి చర్చకు రావడానికి ఉస్మాన్ ఖవాజా రాసిన 'సబ్రీ' ఆత్మకథ కారణమైంది. బంతిని టాంపరింగ్ చేయాలనే ప్రణాళిక గురించి జట్టులోని మరికొందరికి కూడా ముందుగానే తెలుసని, ఈ వ్యవహారం ముగ్గురు ఆటగాళ్లకే పరిమితం కాలేదని ఆయన తన పుస్తకంలో పేర్కొన్నారు. దీంతో అప్పట్లో జరిగిన విచారణ, బాధ్యుల గుర్తింపు, జట్టు సభ్యుల పాత్రపై మళ్లీ ప్రశ్నలు మొదలయ్యాయి.

ఖవాజా చేసిన వ్యాఖ్యలకు డేవిడ్ వార్నర్ మద్దతు ప్రకటించారు. 2018లో జరిగిన విచారణ సక్రమంగా జరగలేదని, వాస్తవాలు పూర్తిస్థాయిలో బయటకు రాలేదని అభిప్రాయపడ్డారు. మరోవైపు అప్పట్లో బంతి టాంపరింగ్‌కు సంబంధించిన విషయాలు మొత్తం జట్టుకు తెలుసనే ఆరోపణలను ప్రస్తుత ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ తీవ్రంగా ఖండించారు. తనకు ఈ వ్యవహారంపై ముందస్తు సమాచారం లేదని స్పష్టం చేశారు. కామెరాన్ బాన్‌క్రాఫ్ట్ కూడా ఈ వివాదంపై తాజాగా స్పందించడంతో ఆస్ట్రేలియా క్రికెట్‌లో విభేదాలు మరింత పెరిగాయి. ఈ నేపథ్యంలో ఫాక్స్ స్పోర్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ స్టీవ్ క్రాలీ కీలక ప్రకటన చేశారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఉస్మాన్ ఖవాజా, డేవిడ్ వార్నర్‌లను రానున్న కొన్ని వారాల పాటు ప్రసార కార్యక్రమాలకు దూరంగా ఉంచుతున్నట్లు వెల్లడించారు. వ్యాఖ్యాతలందరి అభిప్రాయాలను తాము గౌరవిస్తామని, భిన్నమైన అభిప్రాయాలను స్వాగతిస్తామని పేర్కొన్నారు. అయితే వివాదంపై ప్రతిసారీ స్పందించాల్సిన ఒత్తిడి కారణంగా వారు ఆటపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టలేని పరిస్థితి ఉందని తెలిపారు. ప్రేక్షకులకు మెరుగైన క్రికెట్ ప్రసారాలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని, పరిస్థితులను గమనిస్తూ తదుపరి నిర్ణయం తీసుకుంటామని వివరించారు. మరోవైపు ఈ వివాదం కొనసాగుతున్న సమయంలో క్రికెట్ ఆస్ట్రేలియా పాట్ కమిన్స్‌కు అండగా నిలిచింది. బోర్డు సమావేశంలో కమిన్స్ నాయకత్వానికి ఏకగ్రీవ మద్దతు లభించింది. టెస్టు, వన్డే జట్ల కెప్టెన్‌గా ఆయన కొనసాగుతారని స్పష్టం చేసింది. 2018 ఘటనకు సంబంధించి ఆటగాళ్లు, సహాయక సిబ్బంది తమ అనుభవాలను వెల్లడించేందుకు స్వతంత్ర వేదిక ఏర్పాటు చేయనున్నట్లు కూడా ప్రకటించింది.

ధోనీ నిర్ణయం ఆశ్చర్యపరిచింది

• మెంటర్‌గా కొత్త బాధ్యతలు..

జహీర్ ఖాన్ ఆసక్తికర వ్యాఖ్యలు



స్పోర్ట్స్ డెస్క్: ఐపీఎల్‌లో ఆటగాడిగా మహేంద్రసింగ్ ధోనీ వీడ్కోలు పలకడంపై చెన్నై సూపర్ కింగ్స్ కోచ్ జహీర్ ఖాన్ స్పందించాడు. ధోనీ రిటైర్మెంట్ నిర్ణయం తనను ఆశ్చర్యానికి గురిచేసిందని తెలిపాడు. ఆటగాడిగా ధోనీని మైదానంలో చూడలేకపోవడం బాధాకరమైనప్పటికీ, మెంటర్‌గా అతడి అనుభవం జట్టుకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నాడు. ధోనీ నిర్ణయం గురించి తాను ముందుగా ఊహించలేదని జహీర్ వెల్లడించాడు. జట్టు కూర్పు, ఆటగాళ్ల ఎంపికపై చర్చిస్తున్న సమయంలో ధోనీ తన నిర్ణయాన్ని వెల్లడించాడని చెప్పాడు. వేలంలో జట్టుకు మరింత డబ్బు అందుబాటులో ఉంటుందని ధోనీ సరదాగా వ్యాఖ్యానించినట్లు తెలిపాడు. ప్రధాన కోచ్‌గా తనకు ధోనీ మెంటర్‌గా ఉండటం ఎంతో ప్రయోజనకరమని జహీర్ అభిప్రాయపడ్డాడు. అతడి అనుభవం, నాయకత్వ లక్షణాలు యువ ఆటగాళ్లకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నాడు. కీలక సమయాల్లో తన బాధ్యతలను పంచుకుంటూ జట్టుకు అండగా ఉంటాడని ఆశాభావం వ్యక్తం చేశాడు. ఐపీఎల్‌లో ఐదుసార్లు చెన్నై సూపర్ కింగ్స్‌కు టైటిల్ అందించిన ధోనీ, ఇప్పుడు మెంటర్‌గా కొత్త పాత్ర పోషించనున్నాడు. అతడి అనుభవంతో సీఎస్కే మళ్లీ విజయాల బాట పడుతుందని అభిమానులు ఆశిస్తున్నారు.

డబ్ల్యూటీసీలో పంత్ అరుదైన రికార్డు

• 3 వేల పరుగుల మైలురాయి..


ఈ ఘనత సాధించిన తొలి వికెట్ కీపర్‌గా చరిత్ర



వెల్లింగ్టన్: భారత వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో అరుదైన ఘనత సాధించాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో అర్ధసెంచరీ సాధించిన పంత్.. డబ్ల్యూటీసీ చరిత్రలో 3 వేల పరుగులు పూర్తి చేసిన తొలి వికెట్ కీపర్ బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. మూడో రోజు ఆటలో పంత్ 55 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఈ మ్యాచ్‌కు ముందు అతడి ఖాతాలో 2,948 పరుగులు ఉండగా, మరో 52 పరుగులు చేయాల్సి వచ్చింది. కేవలం 55 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేస్తూ ఈ మైలురాయిని అందుకున్నాడు. ఇప్పటివరకు డబ్ల్యూటీసీలో వికెట్ కీపర్లలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా పంత్ నిలిచాడు. ఇదే మ్యాచ్‌లో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కూడా 3 వేల పరుగుల క్లబ్‌లో చేరాడు. 98 పరుగులు చేసిన గిల్ తృటిలో సెంచరీ కోల్పోయాడు. భారత బ్యాటర్ల ధాటికి మూడో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 486/4 పరుగులు చేసి, న్యూజిలాండ్‌పై 118 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. కాగా, గాయం నుంచి కోలుకుని తిరిగి జట్టులోకి వచ్చిన పంత్.. తన అద్భుత బ్యాటింగ్‌తో మరోసారి సత్తా చాటాడు.

సచిన్‌ను కూడా పక్కనపెట్టేవారేమో!

సిరాజ్‌కు చోటివ్వకపోవడంపై కైఫ్ అసంతృప్తి.. టీమ్ మేనేజ్‌మెంట్ తీరుపై విమర్శలు



ఇంటర్నెట్ డెస్క్: న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో భారత స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్‌కు తుది జట్టులో చోటు కల్పించకపోవడంపై మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. రెండు మూడు మ్యాచ్‌ల్లో విఫలమైతేనే అనుభవజ్ఞులైన ఆటగాళ్లను పక్కన పెడుతున్నారని విమర్శించాడు. ప్రస్తుత టీమ్ మేనేజ్‌మెంట్ తీరు ఇలాగే ఉంటే సచిన్ టెండూల్కర్‌ను కూడా జట్టు నుంచి తప్పించేవారేమోనని వ్యాఖ్యానించాడు.

తన యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడిన కైఫ్.. ఇంగ్లండ్ పర్యటనలో అద్భుతంగా బౌలింగ్ చేసిన సిరాజ్‌ను పక్కన పెట్టడం సరికాదన్నాడు. ఒక సిరీస్‌లో వికెట్లు తక్కువగా తీసినంత మాత్రాన ఆటగాడి సామర్థ్యాన్ని తక్కువగా అంచనా వేయకూడదని సూచించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ప్రతి ఆటగాడికి మంచి, చెడు రోజులు ఉంటాయని గుర్తుచేశాడు. సీనియర్ ఆటగాళ్ల అనుభవానికి తగిన గౌరవం ఇవ్వడం లేదని కైఫ్ విమర్శించాడు. సిరాజ్‌తో పాటు రవీంద్ర జడేజాను కూడా పక్కన పెట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేశాడు. ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు టెస్టుల సిరీస్‌లో జడేజా 516 పరుగులు చేసి అద్భుతంగా రాణించాడని గుర్తుచేశాడు. యువ ఆటగాళ్లకు అవకాశాలు ఇవ్వడం అవసరమే అయినప్పటికీ, గతంలో జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించిన సీనియర్ల సేవలను విస్మరించకూడదని కైఫ్ అభిప్రాయపడ్డాడు.

ఆరోపణలతో మానసికంగా కుంగిపోయా: సర్ఫరాజ్

- కష్టకాలంలో గంభీర్ అండగా నిలిచారు.. రెండుసార్లు ఫోన్ చేసి ధైర్యం చెప్పారు



డ్రెస్సింగ్ రూమ్ సమాచారాన్ని బయటకు వెల్లడించానంటూ వచ్చిన ఆరోపణలు తనను తీవ్రంగా బాధించాయని భారత క్రికెటర్ సర్ఫరాజ్ ఖాన్ వెల్లడించాడు. 2024-25లో ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సమయంలో ఈ ఆరోపణలు వచ్చాయని తెలిపాడు. ఈ వివాదంతో తాను మానసికంగా కుంగిపోయానని, కుటుంబ సభ్యులు కూడా తీవ్ర ఆవేదనకు గురయ్యారని చెప్పాడు. ముఖ్యంగా తన తండ్రి బాధపడటం, భార్య ఏడవడం తనను మరింత కలచివేశాయని పేర్కొన్నాడు. ఆ సమయంలో టీమిండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ రెండుసార్లు ఫోన్ చేసి ధైర్యం చెప్పారని సర్ఫరాజ్ గుర్తుచేసుకున్నాడు. అనవసరమైన విషయాలను పట్టించుకోకుండా ఆటపై దృష్టి పెట్టాలని సూచించారని తెలిపాడు. తన తండ్రితోనూ మాట్లాడి, సర్ఫరాజ్‌ను క్రికెట్ ఆడనివ్వాలని చెప్పినట్లు వెల్లడించాడు. తాను ఎలాంటి సమాచారాన్ని లీక్ చేయలేదని సర్ఫరాజ్ స్పష్టం చేశాడు. ఆరోపణలు నిజమైతే భారత్-ఏ జట్టుకు, శ్రీలంక సిరీస్‌కు తనను ఎంపిక చేసేవారు కాదని పేర్కొన్నాడు. మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రాతో ఇంటర్వ్యూలో ఈ విషయాలను పంచుకున్నాడు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

‘ఇఫీ‘ వేదికపై ‘భక్త కన్నప్ప‘ ప్రదర్శన

పెదనాన్న సినిమాకు అరుదైన గౌరవం..

భావోద్వేగానికి గురైన ప్రభాస్




ఎన్ని సంవత్సరాలు గడిచినా కొన్ని కథలు ఎప్పటికీ నిలిచిపోతాయని అగ్ర కథానాయకుడు ప్రభాస్ అన్నారు. తన పెదనాన్న కృష్ణంరాజు నటించిన క్లాసిక్ చిత్రం ‘భక్త కన్నప్ప’కు 57వ అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో (ఇఫీ) అరుదైన గౌరవం దక్కడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. బాపు దర్శకత్వంలో కృష్ణంరాజు, తన తండ్రి ఉప్పలపాటి సూర్యనారాయణ రాజు నిర్మించిన ఈ చిత్రం ‘ఇఫీ‘లో ప్రదర్శితం కావడంపై ప్రభాస్ ఇన్‌స్టాగ్రామ్‌లో స్పందించారు.“నేను చూస్తూ పెరిగిన సినిమా ఇది. పెదనాన్న నటించి, గోపీకృష్ణ మూవీస్ నిర్మించిన ఈ చిత్రానికి బాపు గారు ప్రాణం పోశారు. ఏళ్లు గడిచినా కొన్ని కథలు నిత్యనూతనంగా ఉంటాయి. ‘భక్త కన్నప్ప’ చిత్రాన్ని ఇఫీలో వేడుకగా జరుపుకుంటున్నందుకు గర్వంగా ఉంది. ఇది ఒక అందమైన వారసత్వం, నిజమైన గౌరవం“ అని ప్రభాస్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ క్లాసిక్ చిత్రం 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో భాగంగా దీన్ని ప్రదర్శిస్తున్నారు.ఇక, ప్రభాస్ సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం ఆయన పలు భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. వాటిలో హను రాఘవపూడి దర్శకత్వంలో వస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘ఫౌజీ‘ ఒకటి. ఈ చిత్రం టీజర్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్, హిట్లర్ మధ్య జరిగిన సంభాషణ ఆసక్తి రేపుతోంది.

భారతీయుల రక్తంలో బానిసత్వం ఉందని హిట్లర్ అనగా, ‘ఫౌజీ’ అనే భారత గూఢచారి పరాక్రమాన్ని నేతాజీ ఉదాహరణగా చూపుతారు. భగవద్గీత ఆధారంగా అతడు సృష్టించిన కోడ్‌ను ఛేదించడం బ్రిటిష్ వారికి కూడా సాధ్యం కాలేదని వివరిస్తారు. ఈ చిత్రం వచ్చే ఏడాది మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

టాలీవుడ్‌లో కొత్త ట్విస్ట్..
‘హను-మాన్’ సీక్వెల్‌లో మెగా హీరో!



టాలీవుడ్‌లో సంచలనం సృష్టించిన ‘హను-మాన్’ సినిమా సీక్వెల్‌పై ఊహించని పరిణామం చోటుచేసుకుంది. మొదటి భాగాన్ని నిర్మించిన ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ, మెగా హీరో పంజా వైష్ణవ్ తేజ్ హీరోగా ‘హను-మాన్ 2’ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రానికి ‘హను-మాన్ 2: ది రైజ్ ఆఫ్ వానరాస్’ అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ‘ఎక్కడికి పోతావు చిన్నవాడా’, ‘ఊరు పేరు భైరవకోన’ వంటి చిత్రాలతో గుర్తింపు పొందిన వివ ఆనంద్ ఈ పాన్-ఇండియా ప్రాజెక్టుకు దర్శకత్వం వహించనున్నారు.ఈ సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇందులో కండలు తిరిగిన దేహంతో వైష్ణవ్ తేజ్ వెనక్కి తిరిగి నిలబడి ఉండగా, ఒక భారీ హనుమంతుడి తోక ఆయన్ను ఆకాశంలోకి ఎత్తుతున్నట్లుగా డిజైన్ చేశారు. కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది.అయితే, ఈ ప్రకటన ఇప్పుడు సినీ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. ‘హను-మాన్’ దర్శకుడు ప్రశాంత్ వర్మ, రిషబ్ శెట్టి హీరోగా మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో ‘జై హనుమాన్’ చిత్రాన్ని ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలో ‘హను-మాన్’ సీక్వెల్ హక్కులు తమకే ఉన్నాయని భావిస్తున్న ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్, ఇప్పుడు మరో హీరో, దర్శకుడితో ‘హను-మాన్ 2’ను ప్రకటించడం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుండగా, ఇతర నటీనటుల వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.



కమల్ హాసన్, జేమ్స్ కామెరాన్‌లకు దాదాసాహెబ్‌ఫాల్కే పురస్కారాలు..

టేలర్ స్విఫ్ట్‌కు గ్లోబల్ అవార్డు



దాదాసాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డ్స్ (డీపీఐఎఫ్ఎఫ్) 2026 విజేతల జాబితాను నిర్వాహకులు అధికారికంగా ప్రకటించారు. నవంబర్ 20న తమ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా విడుదల చేసిన ఈ జాబితాలో దేశీయ, అంతర్జాతీయ సినీ ప్రముఖులు చోటు దక్కించుకున్నాడు. పాప్ సంచలనం టేలర్ స్విఫ్ట్ అంతర్జాతీయ కళాకారిణిగా నిలవగా, భారతీయ స్టాండప్ కమెడియన్ సమయ్ రైనా ఉత్తమ హాస్యనటుడి అవార్డును కైవసం చేసుకున్నాడు.సినిమా విభాగంలో ‘ధురంధర్‘ ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. అందులో నటనకు గానూ రణ్‌వీర్ సింగ్ ఉత్తమ నటుడిగా అవార్డు గెలుచుకున్నాడు. ఆదిత్య ధర్ ఉత్తమ దర్శకుడి పురస్కారాన్ని దక్కించుకున్నాడు. ‘సైయారా‘ చిత్రంలో నటనకు అనీత్ పడ్డా ఉత్తమ నటిగా నిలిచింది. అదే సినిమాలోని ‘సైయారా‘ పాటకు ఉత్తమ గీతం అవార్డు లభించింది. కమల్ హాసన్ భారతీయ చిత్ర పరిశ్రమకు చేసిన సేవలకు గానూ విశిష్ట పురస్కారాన్ని పొందగా, దిగ్గజ సంగీత దర్శకుడు ఇళయరాజా సంగీత రంగానికి చేసిన విశేష కృషికి అవార్డు అందుకున్నారు.

గ్లోబల్ సినిమాలో అద్భుతమైన కృషికి గాను హాలీవుడ్ ప్రముఖ దర్శకుడు జేమ్స్ కామెరాన్ పురస్కారం సాధించాడు. ‘అవతార్: ఫైర్ అండ్ యాష్‘ ఉత్తమ అంతర్జాతీయ చిత్రంగా నిలిచింది. ‘సిన్నర్స్‘ చిత్రంలో నటనకు మైఖేల్ బి. జోర్డాన్ ఉత్తమ నటుడిగా ఎంపికయ్యాడు. డిజిటల్ విభాగంలో ‘ది బాద్స్ ఆఫ్ బాలీవుడ్‘ వెబ్ సిరీస్‌కు ఆర్యన్ ఖాన్ ఉత్తమ దర్శకుడి అవార్డు పొందాడు. సీనియర్ నటి స్మృతి ఇరానీ, అక్షయ్ ఖన్నాలు తమ నటనకు ప్రత్యేక గుర్తింపు పొందారు. భారత చలనచిత్ర పితామహుడు దాదాసాహెబ్ ఫాల్కే పేరిట ఈ అవార్డులను ఏటా ప్రైవేట్ సంస్థ అందజేస్తోంది.

ఒక్క లుక్ తో నిద్ర లేకుండా చేస్తున్న నిధి అగర్వాల్!



అందాల నిధిని ఎప్పటికప్పుడు ఆడియన్స్ కు చూపిస్తూ నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ సెగలు పుట్టిస్తున్న నిధి అగర్వాల్ గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. భాషతో సంబంధం లేకుండా.. పలు అవకాశాలు అందుకుంటున్న ఈమె.. తన గ్లామర్ ఫోటోలతో యావత్ దేశ అభిమానులను విపరీతంగా అలరిస్తోంది. చీర కట్టులో సాంప్రదాయంగా కనిపిస్తూనే.. అటు అదే చీరకట్టులో గ్లామర్ వలకబోస్తూ కుర్ర కారుకు నిద్ర లేకుండా చేస్తోందని చెప్పవచ్చు. ఈ క్రమంలోనే ఇంస్టాగ్రామ్ వేదికగా మరో లేటెస్ట్ ఫోటోషూట్ తో ఆడియన్స్ ముందుకు వచ్చిన ఈ ముద్దుగుమ్మ.. తాజాగా షేర్ చేసిన ఫోటోలు మాత్రం అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. చీరకట్టులో కూడా ఇంత గ్లామర్ వలకబోయొచ్చా అంటూ కామెంట్లు చేస్తున్నారు. నిధి అగర్వాల్ ఇంస్టాగ్రామ్ వేదికగా షేర్ చేసిన లేటెస్ట్ ఫోటోషూట్ విషయానికి వస్తే.. డీప్ పర్పుల్ డిజైనర్ లెహంగా ధరించింది నిధి అగర్వాల్. చీర లాగా కట్టుకునే ఫ్యూజన్ లెహంగా చీర ఇది. కింది భాగంలో లెహంగాకు కుచ్చులు ఉండి, పైన చీర కొంగు స్టైల్ లో వస్తుంది. ఇక ఫ్యాబ్రిక్ విషయానికి వస్తే తేలికపాటి షిఫాన్ ఫ్యాబ్రిక్ తో దీనిని డిజైన్ చేశారు.చీర అంచున మొత్తం గోల్డ్ ,సిల్వర్ రంగుల జరీ సీక్వెన్స్, పూసల వర్క్ తో పాటు అందమైన లేస్ , కట్ వర్క్ డిజైన్ తో డిజైన్ చేశారు. ఇక చీర మధ్య భాగంలో అక్కడక్కడ చిన్న చిన్న బుట్టీలు లెహంగా అందాన్ని రెట్టింపు చేశాయి. ఇక లెహంగా కింది భాగంలో భారీ జర్దోసి, జరీ ఎంబ్రాయిడరీ వర్క్ తో డిజైన్ చేశారు. బ్లౌజ్ విషయానికి వస్తే.. చీరకి మ్యాచింగ్ గా స్వీట్ హార్ట్ నెక్ లైన్ కలిగిన హెవీ ఎంబ్రాయిడరీ బ్లౌజ్ ని ధరించింది. చేతులకు చిన్నచిన్న పూసల హ్యాంగింగ్స్ ను జోడించారు. పెద్దపెద్ద జుంకాలు ధరించిన ఈమె చేతికి బంగారు రంగు గాజులు ధరించి తన అవుట్ ఫిట్ ని ఫుల్ ఫిల్ చేసుకుంది. ఇక ఈ చీర లాంటి లెహంగాలో అందాలు ఆరబోస్తూ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ ఇక ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.

వాయిదా పడిన బెల్లంకొండ ‘హైందవ‘..



యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం ‘హైందవ‘ విడుదల వాయిదా పడింది. సంయుక్త కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని తొలుత ఈ నెల 27న విడుదల చేయాలని చిత్ర బృందం నిర్ణయించింది. అయితే, అనివార్య కారణాల వల్ల ఈ సినిమా విడుదలను వాయిదా వేస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.మూన్‌షైన్ పిక్చర్స్ పతాకంపై మహేశ్ చందు నిర్మిస్తున్న ఈ చిత్రానికి లుధీర్ బైరెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. సినిమా వాయిదాపై నిర్మాణ సంస్థ సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేసింది. “అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ప్రేక్షకులకు ఒక ఉత్తమ అనుభూతిని అందించాలనే ఉద్దేశంతోనే ‘హైందవ‘ విడుదలను వాయిదా వేస్తున్నాం. త్వరలోనే నూతన విడుదల తేదీని ప్రకటిస్తాం“ అని మేకర్స్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలుపుతూ ఒక సరికొత్త పోస్టర్‌ను కూడా విడుదల చేశారు.గత నెలలో విడుదలైన ఈ సినిమా టీజర్ ప్రేక్షకుల్లో విశేష ఆసక్తిని రేకెత్తించింది. రంగపురం అనే గ్రామంలోని పురాతన ఆలయంలో విగ్రహాలు మాయమవడం, ఒక గ్రామస్థుడి హత్య నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. ఈ కేసును దర్యాప్తు చేసే నాస్తికుడైన పోలీస్ ఆఫీసర్‌గా బెల్లంకొండ సాయి శ్రీనివాస్ నటిస్తున్నారు. దైవ విశ్వాసం, హేతువాదం మధ్య జరిగే సంఘర్షణే ఈ చిత్ర ప్రధాన ఇతివృత్తం. ఈ సినిమాలో మహేశ్ మంజ్రేకర్ ఆలయ పూజారిగా నటిస్తుండగా, జేడీ చక్రవర్తి, శివాజీ రాజా, గెటప్ శ్రీను ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు.ఈ చిత్రానికి సామ్ సీఎస్ సంగీతం అందిస్తుండగా, హరీశ్ కన్నన్ సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613